ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 23.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:26 (ఆది)
సహరి : 4:37 (సోమ)



కోడిగూడెంలో జరిగిన వైసీపీ బూత్ కన్వీనర్ల సమావేశంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ వెంకట్రాజు (సర్కిల్‌లో)

వైసీపీ సమావేశంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్

ద్వారకా తిరుమల, మార్చి 30 : మండలంలోని కోడిగూడెంలో శుక్రవారం సాయంత్రం జరిగిన వైసీపీ బూత్ కన్వీనర్‌ల సమా వేశంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీకాకుళపు వెంకట్రాజు పాల్గొవడంపై విమ ర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్న సమయంలో ఓ పార్టీ కార్యక్రమంలో అతను ఎందుకు పాల్గొన్నాడని, ఇది కోడ్‌ను ఉల్లంఘించడం కాదా.. అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఎలక్షన్ కమిషన్ స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వలంటీర్ సస్పెన్షన్

ఏలూరు రూరల్, మార్చి 30 : ఇటీవల వైసీపీ సమావేశంలో పాల్గొన్న తంగెళ్లమూడి సచివాలయం-1 వలంటీర్ గూడూరి ప్రేమ్‌ను విధుల నంచి తొలగించినట్టు ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22న జరిగిన వైసీపీ కార్యకర్తల సమావేశంలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రేమ్ పాల్గొనడంతో విచారణ అనంతరం విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు తెలిపారు. కాగా నగరంలో చెత్తసేకరణ వాహనాలపై పచ్చ రంగు తడిచెత్తకు, నీలం పొడిచెత్తకు, నలుపు గాజుచెత్తకు సంబంధిం చినవని కాబట్టి వాటిని తొలగించాల్సిన ఆవశ్యకత లేదన్నారు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన

ఏలూరు కలెక్టరేట్, మార్చి 30: ఎన్నికల్లో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచి ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకునేలా బూత్ లెవల్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సహకరించాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ అన్నారు. జడ్పీ సమావేశ మందిరంలో శనివారం ఏలూరు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ముక్కంటి అధ్యక్షతన బూత్‌లెవల్ అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందితో బూత్‌లెవల్ అసోసియేషన్ గ్రూప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు. ఏలూరు అర్బన్ తహసీల్దార్ ముఖర్జీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

పౌర సేవలన్నీ బంద్

ఎన్నికల వేళ ప్రభుత్వ కార్యాలయాల్లో మందగించిన సేవలు

ఏలూరు రూరల్, మార్చి 30 : రెవెన్యూ కార్యాలయాల్లో పౌరసేవలన్నీ మందగించాయి. సుమారు 15 రోజుల నుంచి కనీస సేవలు కూడా తహసీల్దార్ కార్యాలయాల్లో అందని పరిస్థితి. సాధారణ పౌర సేవలతో పాటు ఎన్నికల నిర్వహణ ప్రక్రియల్లోనూ రెవెన్యూ కార్యాలయాలు కీలకం. ప్రజలు ఏ కార్యాలయాకెళ్లినా తాము ఎన్నికల పనిలో ఉన్నామన్న సమాధానం వస్తోంది. జిల్లాలో ప్రజలకు అసలే అంతంత మాత్రంగా అందుతున్న రెవెన్యూ సేవలు ప్రస్తుతం పూర్తిగా నిలిచిపోయాయి. ఎన్నికల పనుల పేరుతో అత్యధిక రెవెన్యూ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది సాధారణ పౌర సేవలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని జనం వాపోతున్నారు. ప్రత్యేకించి సచివాలయాల్లో వీఆర్వోలు ఎక్కడా కానరావడం లేదు.

కాంగ్రెస్ రెడీ

అభ్యర్థులతో నేడో రేపో జాబితా

- ఇప్పటికే సాగిన సుదీర్ఘ కసరత్తు
- అన్ని స్థానాల్లోనూ పాత, కొత్తతరాల మధ్య పోటీ
- సామాజిక, ఆర్థిక స్థితిగతుల బేరీజు
- అర్హులకే సీట్లు అంటూ సీనియర్లు స్పష్టీకరణ
- ఏఐసీసీ ఆమోదమే తరువాయి

వచ్చే ఎన్నికల్లో తన పార్టీ అభ్యర్థులను ఖరారు చేసేందుకు కాంగ్రెస్ సుదీర్ఘ కసరత్తు చేసింది. నియోజక వర్గాల వారీగా ఆశావహుల నుంచి దరఖాస్తులు కోరింది. క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారుల జయాపజయాలు, వ్యక్తిగత సామర్థ్యాన్ని అంచనా వేశారు. దరఖాస్తులను పూర్తిగా వడపోశారు. గట్టి పోటీ ఇచ్చే అభ్యర్థులను ఎంపికచేసే దిశగా పక్షం రోజుల పాటు సాగిన కసరత్తు దాదాపు తుదిదశకు చేరుకుంది. జిల్లాలో అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో ఆశావహులు కొందరి పేర్లతో ఏఐసీసీకి నివేదించనున్నారు. నేడోరేపో ఢిల్లీ నుంచి జాబితా బయటకు వచ్చే అవకాశాలు లేకపోలేదు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

చానాళ్ల పాటు నిద్రావస్థలో ఉన్న కాంగ్రెస్‌కు ఈ మధ్యనే కాస్తోకూస్తో జీవం వచ్చింది. ఆ మేరకు పార్టీలో పోటీ చేసేందుకు ఆశావహులు ముందుకొచ్చారు. కొన్ని అసెంబ్లీ స్థానాల్లో అంచనాకంటే మించి పార్టీకి దరఖాస్తు చేసుకోవడం కాంగ్రెస్ లోనే సీనియర్‌లను ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఈ క్రమంలోనే కీలక నియోజక వర్గాలు అన్నింటిలోనూ పోటీచేసే అభ్యర్థులను ఎంపిక చేయడానికి కాంగ్రెస్ పెద్దగా కష్టపడాల్సిన అవసరం రాలేదు. పాత, కొత్త కలయికలతో పెద్దఎత్తున పోటీకి సిద్ధపడడం దాంతో సరిపెట్టకుండా ఢిల్లీవరకు తమ ప్రయత్నాలు ముమ్మరం చేయడం విశేషం.

ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి దాదాపు అరడజను మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో పార్టీలో దీర్ఘకాలం పాటు కొనసాగిన వారు కొందరైతే మధ్యలో కాంగ్రెస్ కార్యకలాపాల్లో పాల్గొంటూ దరఖాస్తు చేసుకున్న వారు ఇంకొందరు. వీరందరి దరఖాస్తులను పరిశీలించి వీరిలో సీనియర్ నేత జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావుతో పాటు క్రాంతి పేర్లు తుదిపరిశీలనకు వచ్చినట్టు సమాచారం. ఏలూరు అసెంబ్లీ స్థానంలో ఇంతకు ముందు కాంగ్రెస్‌కి గట్టిపట్టు ఉండేది. పాత తరం వెనుకబడిపోగా కొత్తతరం అంటిముట్టనట్టుగా వ్యవహరించింది. 2014 -19 ఎన్నికల్లోనూ ఆ పార్టీకి లభించిన ఓట్లు అత్యల్పమే. ఇలాంటి పరిస్థితుల్లో తాజాగా కాంగ్రెస్ కొద్దిగా ఊపిరి పీల్చుకుంది. పోటీకోసం దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య పెరగడం వీరిలో అన్ని సామాజికవర్గాల అభ్యర్థులు ఉండడం కొత్త విశేషం. కైకలూరు అసెంబ్లీ స్థానం నుంచి బాబ్జి లేదా నాగరాజు పేర్లు వినిపిస్తున్నాయి. ఈ స్థానంలో ఇంతకు ముందు కాంగ్రెస్ పక్షాన కనుమూరి బాపిరాజు ఎన్నికైన నేపథ్యం ఉంది. అలాంటి ఈ నియోజకవర్గంలో ఇప్పుడు కాంగ్రెస్ కొంచెం కొంచెం జనం మధ్య నానుతోంది. నూజివీడు నియోజకవర్గం నుంచి మరీదు కృష్ణ, వీరమాచినేని సత్యనారాయణ పేర్లు తుది పరిశీలనకు వచ్చినట్టు చెబుతున్నారు. ఒకటి, రెండుసార్లు సామాజిక పరిస్థితులు, ఆర్థిక పరిస్థితులు రెండింటిని బేరీజు చేసుకుని తుది నిర్ణయం తీసుకోబోతున్నారు. దెందులూరు నియోజకవర్గం నుంచి యువనాయకులు డి.వి.ఆర్.కె చౌదరి, కాంగ్రెస్ టిక్కెట్ రేసులో ముందంజలోనే ఉన్నారు. యువజన కాంగ్రెస్ నాయకుడిగా ఇంతకు ముందు ఉమ్మడి జిల్లాలో క్రియాశీలకంగా వ్యవ హరించారు దెందులూరు అసెం బ్లీ స్థానం నుంచి పోటీకి దిగారు. ఈసారి కూడా అదేస్థానం నుంచి కాంగ్రెస్ టిక్కెట్ ఆశిస్తున్నారు. కాంగ్రెస్ సీనియర్ల ఆశీస్సులు తీసుకుని కొంచెం ముందడుగు వేసే ప్రయత్నం చేశారు. పార్టీని నమ్ముకుని ఉన్న తనకు తగిన అవకాశం ఇస్తా రని ఆశతో ఉన్నారు. చౌదరితో పాటు ఆలపాటి నరసింహమూర్తి పోటీ పడుతున్నారు. సీనియర్‌గా తనకు అన్నివిధాలా పోటీచేసే అర్హత ఉందని ఆయన భావిస్తున్నారు. చౌదరి, నరసింహమూర్తి రెండుపేర్లను ఏఐసీసీ పరిశీలన జాబితాలో ఉన్నట్టు పార్టీవర్గాల సమాచారం. ఉంగుటూరు నియోజకవర్గం నుంచి సీనియర్ నేత హరికుమార్‌రాజు టిక్కెట్ రేసులో ఉన్నారు. దీర్ఘకాలంగా ఆయన పార్టీని నమ్ముకుని, పార్టీ పిలుపు ఇచ్చినప్పుడల్లా కార్యక్రమాల నిర్వహణలో ముందు వరుసలో నిలుస్తూ వచ్చారు. వీలైతే సామాజిక వర్గాల దృష్ట్యా ఆయనకు అవకాశం ఇవ్వాలని కేడర్ పట్టుబడుతోంది. సమాంతరంగా ఇదే నియోజకవర్గం నుంచి సచ్చేంద్రబాబు సైతం టిక్కెట్ రేసులో ఉన్నారు.

పొత్తుల సంగతేంటి?

వామపక్షాలతో కాంగ్రెస్ పొత్తు కుదుర్చుకుంది. సీట్ల ఖరారుపై సోమవారం ఇరుపక్షాలు పరస్పరం చర్చించుకోబోతున్నాయి. పోలవరం అసెంబ్లీ స్థానాన్ని అటు సీపీఎం, సీపీఐ ఆశిస్తున్నాయి. ఈ రెండు పార్టీల్లో ఎవరికి పోలవరం దక్కుతుందనేది ఇప్పటికి సస్పెన్సే. ఈ తరహా పరిస్థితిపై ఏపీసీసీ, వామపక్షాల మధ్య పరస్పర సయోధ్యచర్చలు జరగనున్నాయి. ఎందుకనంటే ముందుగానే పోలవరంను వామపక్షాలు ఆశిస్తుండటంతో ఆ స్థానం మినహాయించి మిగతా స్థానాల పైనే కాంగ్రెస్ ఫోకస్ పెట్టింది. ఈ నేపథ్యంలోనే వామపక్షపార్టీలు సైతం పోలవరం నుంచి పోటీచేసేది తామేనని ఓ నిర్ణయానికి వచ్చేశాయి. శనివారం కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం విజయవాడలో జరిగింది. వచ్చే రెండు,మూడు రోజుల్లోనే కాంగ్రెస్ జాబితా వెలువడుతుందని అప్పటివరకు ఓపిక పట్టాలని సమావేశానికి హాజరైన వారికి కాంగ్రెస్ పెద్దలు గట్టి సంకేతాలు ఇచ్చారు. పార్టీని పూర్తిగా పటిష్ఠపరిచి జనం మధ్యకు వెళ్ళేందుకు వీలుగా తక్షణం కార్యరంగంలోకి దిగాలని కాంగ్రెస్ మేనిఫెస్టోను పెద్దఎత్తున ప్రచారం చేయాలని పదేపదే కాంగ్రెస్ విజ్ఞప్తి చేసింది. ఈ నేపథ్యంలో ఇంటింటికి కాంగ్రెస్ పేరిట ప్రచారానికి సమాయత్తం అవుతున్నారు.

చింతలపూడిలో ఎలీజాకు చోటు?

చింతలపూడి సిట్టింగ్ ఎమ్మెల్యే ఎలీజాకు ఇదే నియోజకవర్గం నుంచి టిక్కెట్ ఇవ్వాలని కాంగ్రెస్ యోచిస్తోంది. ఈ మధ్యనే ఆయన వైసీపీకి రాజీనామా చేసి పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన సిట్టింగ్ ఎమ్మెల్యేలు అందరికి తొలిప్రాధాన్యత ఇచ్చి వచ్చే ఎన్నికల బరిలో నిలపాలని కాంగ్రెస్ ఇప్పటికే తుది నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలోనే ఎలీజాకు టిక్కెట్ ఇస్తారని ఆయన కూడా పోటీకి ఉత్సాహంతో ఉన్నారని అందరూ భావిస్తున్నారు. మాజీ ఐ.ఆర్.ఎస్ అధికారైన ఎలీజా పట్ల చివరిలో అధికార వైసీపీ అనుసరించిన వైఖరి కొందర్ని తీవ్ర మనస్థాపానికి గురి చేసింది. ఎలీజా సైతం తాను ఉన్న పార్టీలోనే తనకు టిక్కెట్ ఇవ్వకపోగా వేరొకరికి అవకాశం ఇచ్చిందే కాక తనను అవమానించే రీతిలో వ్యవహరించడాన్ని జీర్ణించుకోలేకపోయారు. కొన్నాళ్ల పాటు తెలుగుదేశంలో చేరతానంటూ ఎలీజాపై విస్తృతప్రచారం సాగినా చివరకు ఆయన కాంగ్రెస్‌నే ఎంచుకుని ఆ పార్టీలోనే చేరారు. ఈ నేపథ్యంలో ఎలీజా పోటీచేస్తే మెరుగైన ఓటర్ల మద్దతు లభిస్తోందని, అధికార వైసీపికి తగిన గుణపాఠం చెప్పిన వారమవుతామని ఆ పార్టీనేతలు ఇప్పటికే ఒక నిర్ణయా నికి వచ్చారు. ఎలీజా సైతం తనకు జరిగిన పరాభావాన్ని దృష్టిలో పెట్టుకుని పోటీకి దిగుతున్నట్టు చెబుతున్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన : కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, మార్చి 30 : మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఎదుర్కొనే అనారోగ్య సమస్యలపై ప్రజలతో పాటు యువతకు అవగాహన కల్పించాలని, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో నార్కో కోఆర్డినేషన్ సెంటర్ జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. గంజాయి నియంత్రణ, డ్రగ్స్ అక్రమ రవాణా, తదితర అంశాలపై సంబంధిత శాఖలు తీసుకున్న చర్యలపై ఎస్పీ మేరీప్రశాంతితో కలిసి కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు లేనప్పటికి అటవీ ప్రాంతాల్లో రెండునెలల పాటు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని, డీఎఫ్‌వో రవీంద్ర దామాను ఆదేశించారు. సెబ్ జేడీ ఎన్.సూర్యచంద్రరావు, సైకాలజిస్టులు డాక్టర్ కె.హెచ్ కోమలి, వీర్రాజు, ఆశ్రం ఆసుపత్రి చీఫ్ అడ్మిన్ బి.ధనిష్ఠ, ఉపరవాణ కమిషనర్ శాంతకుమారి, ప్రజారవాణాశాఖ అధికారి వరప్రసాద్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. శనివారం ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్‌లో తాగునీటి ఎద్దడి నివారణ, ఉపాధి హామీ తదితర అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల పై దిశ,నిర్దేశం చేశారు. అత్యవసర మరమ్మతులకు మండలపరిషత్ నిధులు వినియోగించుకోవాలన్నారు.

ముగిసిన టెన్త్ పరీక్షలు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 30 : పదో తరగతి పరీక్షల్లో చివరిదైన ఓఎస్ఎస్‌సీ సంస్కృతం పేపర్-2 పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసిందని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు జిల్లాలో 317 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 309 మంది, వృత్తివిద్య (ఒకేషనల్) పరీక్షకు 915 మందికి 795 మంది హాజరయ్యారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు.

'ఓపెన్' ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రశాంతం

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 30 : ఏపీ ఓపెన్ స్కూల్స్ దూరవిద్య ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలో భాగంగా శనివారం జరిగిన భౌతికశాస్త్రం పరీక్షకు జిల్లాలో 160 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 126 మంది, రసాయనశాస్త్రం పరీక్షకు 140 మందికి 109 మంది, జీవశాస్త్రం పరీక్షకు 65 మందికి 59మంది హాజరయ్యారని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.



వర్క్‌షాపులో మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి కృష్ణమోహన్

వర్క్‌షాపులతో న్యాయ విజ్ఞానం పెంపు

హైకోర్టు జడ్జి జస్టిస్ కృష్ణమోహన్

ఏలూరు కలెక్టరేట్/ఏలూరు క్రైం, మార్చి 30 : న్యాయవిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి న్యాయ మూర్తులకు వర్క్‌షాపులు దోహదపడతాయని రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్ అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ కుమార్ అధ్యక్షతన జిల్లాలోని న్యాయమూర్తులకు వివిధ అంశాలపై నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయమూర్తులకు చట్టంపై స్థూలమైన, విధానపరమైన విజ్ఞానం ఎప్పటికప్పుడు అవసరమన్నారు. వర్క్‌షాపులో రీసోర్స్ పర్సన్లుగా సీనియర్ న్యాయవాదులు వై.వి రవిప్రసాద్, ఎం.సూరిబాబు, రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి ఎం.సాల్మన్ రాజు పాల్గొని పార్టీషన్, మార్టిగేజ్, మనీ.డిక్లరేషన్, ఇంజెక్షన్ చట్టాలు మారుతున్న సవరణలపై అవగాహన కల్పించారు. అనంతరం కేసుల విచారణ, పురోగతి తదితర విషయాలను చర్చించారు. తొలుత జస్టిస్ బి.కృష్ణ మోహన్ ఏలూరు జిల్లా కోర్టు వద్ద పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామ్‌గోపాల్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఏలూరు బార్ అధ్యక్షుడు అబ్బినేని విజయ్‌కుమార్ పూల మొక్కను అందించారు. న్యాయశాఖ ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాగా జస్టిస్ కృష్ణమోహన్ ను జడ్పీ గెస్ట్ హౌస్‌లో ఎస్పీ మేరీ ప్రశాంతి మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమ కుమార్,ఎస్పీ మేరీ ప్రశాంతి ఆయనతో సమావేశమయ్యారు.

కోర్టుల్లో మౌలిక సదుపాయాల కల్పన

కోర్టుకు వచ్చే కక్షిదారులకు, న్యాయవాదులకు, సిబ్బంది, న్యాయాధికారులకు మౌలిక సదుపాయాల్లో భాగంగా కోర్టు హాల్స్‌లో ఎయిర్ కండీషన్స్ ఏర్పాటు చేస్తామని జస్టిస్ బి.కృష్ణమోహన్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రప్రథమంగా ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని అన్ని కోర్టు హాళ్లల్లో ఏర్పాటు చేసిన ఏసీలను, రూ.22 లక్షలతో ఏర్పాటు చేసిన లిఫ్టును, సోలార్ సిస్టమ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. 'రాష్ట్ర వ్యాప్తంగా 643 కోర్టులలో ఎయిర్ కండీషన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 48 కోర్టులు ఉండగా 209 ఏసీ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఏలూరు జిల్లా కోర్టు ఎంతో చరిత్ర కలిగి ఉంది.' అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ పురుషోత్తమకుమార్, మొదటి అదనపు జిల్లా జడ్జి రామ్‌గోపాల్, పరిపాలనాధికారి నాగరాజు, న్యాయాధికారులు, అధికారులు పాల్గొన్నారు.



ఏలూరు జిల్లా కోర్టులో ఏసీలను ప్రారంభిస్తున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్

■ ఆంధ్రజ్యోతితో ఆఫీసర్

ఏజెన్సీలో పటిష్ట నిఘా

పోలవరం ఆర్వో సూర్యతేజ



- పూర్తిగా మన్యం ప్రాంతంలో ఉన్న పోలవరం ఎస్టీ నియోజకవర్గంలో పటిష్ట ఎన్నికల నిఘా ఏర్పాట్లను చేశాం. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి, పోలింగ్ శాతం పెంచడానికి అన్ని ఏర్పాట్ల చేశాం. నియోజ కవర్గంలో 2,52,592 మంది ఓటర్లు ఉండ గా పురుషులు 1,22,201 మంది మహి ళలు 1,30,380 మంది, 11 మంది జెండర్స్ ఉన్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఏడు మండలాలు ఉండగా కొయ్యలగూడెంలో అధికంగా వేలేరుపాడు మండలంలో తక్కువగా ఓటర్లు ఉన్నారు.
- నియోజకవర్గంలో 284 పోలింగ్ కేంద్రాలు ఉండగా 44 సెక్టార్లుగా విభజించి, సెక్టారుకు 44 మంది గెజిటెడ్ ఆఫీసర్లను నియమించాం. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 8, ఎస్ఎస్‌టి 4, వీఎస్‌టి 4 టీమ్‌లను ఏర్పాటు చేశాం. ఎస్ఎస్‌టీ టీమ్‌లను కొయ్యల గూడెం, జీలుగుమిల్లి మండలాల్లో ఏర్పాటు చేశాం.
- నియోజకవర్గంలో సమస్యాత్మక గ్రామాలు 95 ఉన్నాయి. ఎన్నికలకు సంబంధించిన సమస్యలను నేరుగా నా దృష్టికి తీసుకురావొచ్చు. లేదా 08821-232221కు ఫోన్ ద్వారా చెప్పవచ్చు.
- నియోజకవర్గంలో కాకిసనూరు అనే పోలింగ్ స్టేషన్ చాలా దూరంలో ఉంది. అక్కడికి సుమారు 800 మంది ఓటర్లు వెళ్లాల్సి ఉంది. వీరంతా బోటు, లాంచీల ద్వారా వెళ్లేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. నియోజకవర్గంలో 80-85 ఏళ్ల దాటిన వృద్ధులు 306 మంది ఉన్నారు. దివ్యాంగుల గుర్తింపు జరుగుతోంది.

- బుట్టాయగూడెం

కలుషిత నీరే దిక్కు!

- ఏలూరులో పలు ప్రాంతాల వాసుల ఆవేదన
- విలీన గ్రామాల్లో సమస్య మరింత జఠిలం
- వాటర్ ట్యాంకుల ద్వారా బోరునీరు సరఫరా.. సుద్దనీటితో అనారోగ్యాలు

ఏలూరు టూటౌన్, మార్చి 30 : నగరంలో కలుషిత నీరు సరఫరా చేస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొన్ని రోజుల నుంచి నగరపాలక సంస్థ అందించే తాగునీరు పసుపు, ఆకుపచ్చ రంగులో వస్తోంది. స్థానికులు ఫిర్యాదు చేస్తున్నప్పటికి అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో సరఫరా అయిన తాగునీరును తాగడంతో ప్రజలు తీవ్ర అనారోగ్యాల పాలవుతు న్నారు. రెండు పూటలా స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామని పాలకులు అధికారులు ఊదరగొడుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి దీనికి పూర్తి విరుద్ధం. ఒకటో డివిజన్ నల్లదిబ్బ ప్రాంతంలో 15 రోజుల నుంచి ఆకుపచ్చ రంగుతో నీరు సరఫరా అవుతోంది. వన్‌టౌన్‌లో అనేక ప్రాంతాల్లో పసుపురంగులో తాగునీరు వస్తున్నాయి. నగర మేయర్ నూర్జహాన్ ఉండే ఎస్ఎంఆర్ కాలనీలో 15 రోజుల నుంచి సరిగా తాగునీరు పైపుల నుంచి రావడంలేదు. అధికారులు, పాలకవర్గం పట్టించుకోవడంలేదు. కాలనీ ప్రజలు వాటర్ ప్లాంట్ల నుంచి తాగునీరు కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎంఆర్‌సీ కాలనీ, రాణినగర్ లంకపేట, ఇజ్రాయిల్ పేట, బావిశెట్టివారి పేట, నల్లదిబ్బ, దక్షిణపు వీధి, పోణంగి పుంతరోడ్డు, వంగాయి గూడెం, తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉంది. ఈ ప్రాంతాలకు పైపులైన్లు లేకపోవడం తో తాగునీటి ట్యాంకర్ల కోసం ప్రజల ఎదురు చూపులు తప్పడం లేదు. ఒకవేళ వచ్చిన ఒకటి రెండుబిందెలతోనే కుటుంబమంతా సరిపెట్టుకోవా ల్సిన పరిస్థితి. ట్యాంకర్లు రాని రోజు బయట కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.



వాటర్ ప్లాంట్ నుంచి నీరు తీసుకెళ్తున్న స్థానికుడు

విలీన గ్రామాల్లో.

విలీన గ్రామాలైన శనివారపుపేట, సత్రంపాడు, తంగెళ్ళమూడి, కొమడవోలు, పోణంగి, మాదేపల్లి, వెంకటపురం పంచాయతీల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఇక్కడ ప్రజలకు బోరు వాటర్‌ను వాటర్ ట్యాంకులకు ఎక్కించి సరఫరా చేస్తున్నారు. ఈ బోర్ వాటర్‌లో సుద్ద ఎక్కువగా వాడడంతో ప్రజలు తరచూ అనారోగ్యాల పాలవుతున్నారు. విలీన గ్రామాల ప్రజలకు గోదావరి జలాలతో తాగునీరు అందిస్తామని ఐదేళ్ల కిందట వైసీపీ నాయకులు ఓట్లు వేయించుకుని గెలిచిన తర్వాత వారిని పట్టించుకోలేదు. రెండేళ్ల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల సమయంలోనూ మళ్లీ గోదావరి జలాలు అందిస్తామని వాగ్దానాలు చేశారు. గెలిచిన తర్వాత తాగునీటి సమస్య ఊసే ఎత్తడం లేదు. పాలకమండలిలో 50 డివిజన్‌లలో 47 వైసీపీ కార్పొరేటర్లు ఉన్నారు. అయినప్పటికి గోదావరి జలాలు విలీన గ్రామాలకు అందించడంలో విఫలమయ్యారని ప్రజలు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ ఎన్నికలు రావడంతో అదే వాగ్దానంతో తమను మోసగించేందుకు వైసీపీ నాయకులు సిద్ధమవుతున్నారని విలీన గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పసుపు రంగులో ఉన్న తాగునీరు

వాగ్దానాలు మరచిపోతున్న పాలకులు

వైసీపీ నాయకులు ఎన్నికల వాగ్దానాలను అధికారంలోకి వచ్చిన తర్వాత మరచిపోతున్నారు. విలీన గ్రామాలకు గోదావరి జలాలు అందిస్తామని గత ఎన్నికల్లో వైసీపీ నాయకులు హామీ ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోను ఇలాంటి వాగ్దానాలే చేశారు. విలీన గ్రామాల్లో బోరు నీళ్లలో సున్నం ఉండడం వల్ల ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. విలీన గ్రామాలకు పైపులైన్లు వేసి గోదావరి జలాలు అందించాలి.

- పి.కిషోర్, సీపీఎం నగర కార్యదర్శి

కలుషిత నీరు.. అవాస్తవం

కలుషిత నీరు సరఫరా చేస్తున్నట్టు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదు. ఎప్పుడైన పైపులైన్ల లీకేజీల వల్ల కలుషిత నీరు వచ్చినా స్థానికుల ఫిర్యాదు మేరకు తక్షణం మరమ్మతులు చేసి స్వచ్ఛమైన నీరు అందిస్తున్నాం. దెందులూరు వద్ద 110 ఎకరాల్లో మూడు మిలియన్ లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు ఉంది. దానిలో 45 రోజులకు సరిపడ తాగునీరు ఉంది. రెండుపూటలా సరఫరా చేస్తున్నాం. పైపులైన్లు లేనిచోట్ల ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నాం. విలీన గ్రామాల్లో గోదావరి జలాలు అందించేందుకు 112 కోట్లతో టీపీఆర్ తయారు చేశాం. పాలక మండలి దీనిని ఆమోదించింది. అమృత నిధుల నుంచి పైపులైన్లు వేసే కార్యక్రమం త్వరలో ప్రారంభమవుతుంది.

- సాయి, ఏఈ, నగరపాలక సంస్థ



దెందులూరులో మట్టితో పూడుస్తున్న అక్రమ లేఅవుట్

ఇరిగేషన్ కాల్వను పూడ్చి..

దర్జాగా అక్రమ లేఅవుట్

- కొంతమంది రెవెన్యూ అధికారుల సహకారం
- జిల్లా అధికారులకు తెలియడంతో భూ యజమానికి నోటీసులు.. పనులు నిలుపుదల

దెందులూరు, మార్చి 30 : ఎన్నికల కోడ్ ఉండడంతో ఎవరూ పట్టించుకోరనే రెవెన్యూ అధికారుల అతి తెలివితో కొంతమంది రెవెన్యూ అధికారుల కనుసన్నల్లో కోట్ల విలువ చేసే ఇరిగేషన్ భూమి ఆక్రమణలకు గురవుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దెందులూరు సచివాలయం, టీటీడీ కల్యాణ మండపం పక్కనే సర్వే నెంబర్ 733 (4)లో 14 సెంట్లు, 734 (4) లో 36 సెంట్లు భూమి ఉంది. ఆ భూ యజమాని ఎలాంటి ల్యాండ్ కన్వర్షన్ గానీ ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోకుండా అనధికారికంగా ఇరిగేషన్ కాల్వను నిబంధనలు విరుద్ధంగా పూడ్చి తన భూమిలో కలిపి దర్జాగా అక్రమ లేవుట్ వేస్తూ మట్టితో పూడ్చుతు న్నారు. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే మార్గం ముందు రోడ్డు పక్కనే ఈ తంతు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు సరికదా వత్తాసు పలుకుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయం జిల్లా అధికారులకు తెలియడంతో భూ యజమానికి నోటీసు ఇచ్చి పనులు నిలుపుదల చేయించినట్టు తెలుస్తోంది. దీనిపై గ్రామ రెవెన్యూ అధికారి అనురుద్దీన్‌ను వివరణ కోరగా భూమి యాజమాని ఎలాంటి అనుమతి తీసుకోలేదని, ల్యాండ్ కన్వర్షన్ పెట్టలేదని, తహసీల్దార్ ఆదేశాలతో పనులు నిలుపుదల చేశామన్నారు. అయితే అప్పటికే 95 శాతం అక్రమ లేఅవుట్‌లో మట్టి తోలకం పూర్తయింది. దానితో పాటు దర్జాగా ఇరిగేషన్ కాల్వ పూడ్చి వేయడం వెనుక కొంతమంది రెవెన్యూ అధికారుల పాత్ర ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై తహసీల్దార్ జితేంద్ర వివరణ ఇస్తూ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ లేఅవుట్‌లో మేరువ మట్టిని తరలించే పనులు జరగడం వాస్తవమేనని, తన దృష్టికి రావడంతో వెంటనే పనులు నిలుపుదల చేయించి నోటీసులు ఇచ్చామన్నారు.



రంగులు మార్చారు

పెంటపాడు, మార్చి 30 : ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన ఇంకా రంగుల్లోనే కార్యాలయాలు కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని బోడపాడు పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న ఇనుప స్థంభాలకు వేసిన వైసీపీ రంగులను అధికారులు తొలగించారు.

వీటి మాటేమిటి ?





వైసీపీ రంగులు వేసి హంగులతో ముస్తాబు చేసిన వాహనాలకు ఎన్నికల కోడ్ వచ్చినా రంగులు మాత్రం తొలగించడం లేదు. గ్రామాలలో చెత్త సేకరించే రిక్షాలకు వైసీపీ రంగులు వేసారు. వాటిపై నాయకుల బొమ్మలకు స్టిక్కర్లు వేశారు కానీ రంగులు తొలగించ లేదు. రేషన్ పంపిణీ చేసే వాహనాలదీ ఇదే పరిస్థితి. సీఎం జగన్ బొమ్మ కానబడకుండా పేపర్ అతికించారు. రంగులు తొలగించలేదు. ఈ నెల 1 వ తేదీ నుంచి రేషన్ పంపిణీ జరగనుంది. తడిచెత్త, పొడిచెత్త సేకరించే వాహనాలకు వేసిన వైసీపీ రంగులు తీయలేదు. మరి వీటికి ఎన్నికల కోడ్ వర్తించదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఇక్కడ ఇలా..!



ఆకివీడు, మార్చి 30: ఆకివీడులో శనివారం వైసీపీ రంగులతో ఉన్న వాహనంతో పన్నులు చెల్లించాలంటూ మైకులో చెబుతున్నారు. నిబంధనలు పాటించాల్సిన అధికారులే ఈ విధంగా ఉంటే ఉన్నతాధికారులు ఏమి చేస్తున్నట్లు అని పలువురు ప్రశ్నిస్తున్నారు.



ఉప్పుటేరు చెక్‌పోస్టు వద్ద సూచనలు చేస్తున్న జేసీ ప్రవీణ్ ఆదిత్య

చెక్‌పోస్ట్‌లు మరింత కట్టుదిట్టం : జేసీ ప్రవీణ్ ఆదిత్య

ఆకివీడు రూరల్ మార్చి 30 : జిల్లా సరిహద్దులోని చెక్‌పోస్టులను మరింత కట్టుదిట్టం చేస్తున్నట్లు జేసీ ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. ఆకివీడు మండలం ఉప్పుటేరు వద్ద ఉన్న చెక్‌పోస్టును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వాహనాల తనిఖీలను రిజిస్టర్‌లో నమోదు చెయ్యాలని సూచించారు. రాత్రిపూట చెక్ చేసేందుకు లైట్లు ఏర్పాటు చెయ్యాలని, సీసీ కెమెరా ఏర్పాట్లును పరిశీలించారు. ఏలూరు వంతెన వద్ద పరిశీలించి అవసరమైతే చెక్‌పోస్టును ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బంది పనితీరు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో రామకృష్ణ, ఎస్‌ఐ నాగబాబు, పంచాయతీ , పోలీస్ సిబ్బంది ఉన్నారు.

66 లీటర్ల మద్యం..2.43 లక్షల నగదు స్వాధీనం

ఏలూరు క్రైం,మార్చి 30 :ఎన్నికల దృష్ట్యా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఏలూరు ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 66.65 లీటర్ల మద్యం (రూ24 వేలు) రెండు లక్షల 43 వేల 400 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఎనిమిది చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటికి 31 ఫ్లైయింగ్ సర్వైలెన్స్ టీమ్‌లు ఆకస్మికంగా వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నాయన్నారు.ఓటర్లను ఎవరైనా ప్రలోభపెట్టినా, వారికి ఆటంకం కల్గించినా సహించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గణపవరంలో లక్షా 6 వేలు స్వాధీనం

గణపవరం, మార్చి 30: ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే చర్యలు తప్పవని ఉంగుటూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావల్లి స్పష్టం చేశారు. శనివారం గణపవరంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం జరిపిన తనిఖీల్లో లక్షా 6 వేల రూపాయలు సీజ్ చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదును స్ట్రాంగ్‌రూమ్‌లో అప్పగించామన్నారు.

గంజాయి కేసుల్లో ఉన్నవారిని అరెస్టు చేయండి : ఎస్పీ

ఏలూరు క్రైం, మార్చి 30 : గంజాయి కేసుల్లో ఉన్న ముద్దాయిలు పరారీలో ఉన్నట్లయితే తక్షణం వారిని అరెస్టు చేయాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాలు జారీ చేశారు. ఏలూరు పోలీస్ కార్యాలయం నుంచి ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్ డివిజన్‌లో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ గంజాయి కేసులో ఉన్న ముద్దాయిలపై నిఘా ఏర్పాటు చేయాలని, ఇప్పటికే పరారీలో ఉన్నవారిని అరెస్టు చేసి కోర్టులలో హాజరు పర్చాలని ఆదేశించారు.

పాపికొండల్లో జలధార వృక్షం



పోలవరం, మార్చి 30 : పోలవరం మండలం పాపికొండల అభయారణ్యంలో అరుదైన జలదార వృక్షం కనిపించడంతో ఆ వీడియోలు శనివారం ప్రసార మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. నీటి నిల్వలను దాచుకునే తత్వం కలిగిన నల్లమద్దిగా పిలవబడే వృక్షం పాపికొండల నేషనల్ పార్కులో కింటుకూరు అటవీ ప్రాంతంలో బేస్ క్యాంప్ పరిశీలనకు వెళ్లిన అటవీశాఖ సిబ్బందికి కనిపించింది. పరిశీలన కోసం వృక్షానికి కొంతమేర గాటు పెట్టగా ఆ గాటు నుంచి నీరు ఎగదన్నింది. అటవీశాఖ క్షేత్రాధికారి దావీదురాజు మాట్లాడుతూ వాడుక భాషలో నల్లమద్ది, చంద్రమద్దిగా పిలవబడే ఈ వృక్షానికి 20 నుంచి 40 లీటర్ల వరకు నీటిని నిల్వ ఉంచుకునే సామర్థ్యం కలిగి ఉంటుందని, వీటి సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక గిరిజనులు మాట్లాడుతూ పూర్వం అడవుల్లో వేటకు వెళ్లిన వారు దాహార్తిని తీర్చుకోవడానికి ఈ వృక్షానికి గాట్లు పెట్టి ఆ నీటిని తాగేవారన్నారు. ఆ నీటిలో ఔషధ గుణాలున్నాయని చాలా మంది నమ్ముతారని లీటరు నీటిని రూ.వెయ్యికు కూడా కొనేవారని తెలిపారు.

ముద్ద దిగట్లే!



భీమవరంలోని ఒక స్కూల్లో ముద్దగా ఉన్న మధ్యాహ్న భోజనం

రేషన్ ద్వారా 1121 రకం బియ్యం సరఫరా

వండితే ముద్ద..ముద్ద

మధ్యాహ్న భోజన పథకానికి ఇవే బియ్యం

విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం

భీమవరం రూరల్, మార్చి 30 : రేషన్ ద్వారా సన్న బియ్యం, నాణ్యమైన బియ్యం ఇస్తామని వైసీపీ ప్రభుత్వం ఊదరగొట్టింది. నాణ్యత మాట దేవుడెరుగు.. ఆ బియ్యం తింటుంటే అరగక ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవే బియ్యం పాఠశాలల మధ్యాహ్న భోజన పథకానికి వినియోగిస్తున్నారని విద్యార్థులకు కడుపునొప్పి సమస్యలు వస్తున్నాయని అంటున్నారు. అన్నం ముద్దయిపోతోందని చెబుతున్నారు. మధ్యాహ్నం భోజనం పథకంలో విద్యార్థులు భోజనం చేసిన తరువాత వాంతులు అవుతున్న సంఘటనలు పలు చోట్ల చోటు చేసుకున్నాయి. దీంతో విద్యార్థులు ఇంటి నుంచే కారేజీలు పట్టుకెళ్తున్నట్లు పరిస్థితులు ఉన్నాయి.

జిల్లాలో రేషన్ చౌకడిపోల ద్వారా నెలనెలా 5 లక్షల 70 వేల కార్డుదారులకు 8600 మెట్రిక్ టన్నుల బియ్యం సివిల్ సప్లయ్ ద్వారా అందించడంతో పాటు జిల్లాలోని 1,374 ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకానికి అందిస్తున్నారు. గత ప్రభుత్వాల హయాంలో మధ్యాహ్న భోజన పథకానికి గాని, అంగన్‌వాడీ కేంద్రాలకు గాని పాత బియ్యం, అరుగుదల వీలుగా ఉండే స్వర్ణ రకం బియ్యం ఇచ్చేవారు. వైసీపీ ప్రభుత్వంలో నాణ్యమైనవి, పోషకాహార విలువలు ఉన్నవి అంటూ ఒకటే బియ్యం అందిస్తున్నారు. రైతుల లెక్క ప్రకారం సన్న బియ్యం అంటే సోనా రకం. లావు బియ్యం అంటే స్వర్ణ వంటివి.మన ప్రాంతాల్లో స్వర్ణ, 1121, ఇలాంటి రకాల సాగు ఎక్కువ. ప్రభుత్వం ద్వారా రేషన్, మధ్యాహ్న భోజన పథకానికి ఇచ్చే బియ్యం రకం 1121. ఈ రకం బియ్యం తినడానికి వీలుకాని దని రైతులే నిర్ధారించారు. వీటిని జాగ్రత్తగా వండకపోతే అయితే ముద్దయి పోతుందని లేదంటే ఉడకకుండా పలుకులుగా ఉంటుందని మధ్యాహ్న భోజన పథకం వంట వండేవారే చెబుతున్నారు. గతంలో మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రత్యేక ట్యాగ్ ఉన్నవాటినే సరఫరా చేసేవారు.

ఉడకని బియ్యంతో ఎసిడిటీ సమస్యలు

స్వర్ణ, సంపత్ రకాలు తినడానికి బావుంటాయి. గతంలో వీటిని ఇచ్చేవారు. వీటి సాగు తగ్గిపోవడంతో దాళ్వా పంటలో 1010 రకం ఎక్కువగా సాగు చేసేవారు.అయితే ఈరకం బియ్యం కూడా అంతంగా ఉపయోగపడేది కాదు. దీంతో గత ప్రభుత్వాలు సార్వాలో పండించే స్వర్ణ రకం, 1061 వంటివే రేషన్, మధ్యాహ్న పథకానికి అందించేవారు. అన్నం తినడానికి వీలుకాని బియ్యం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయి. జీర్ణాశయానికి ఇబ్బంది ఏర్పడుతుంది. దాని వల్ల విరోచనాలు, వాంతులతో పాటు ఎసిడిటీ సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు.

అప్పుడే.. భగభగలు



శనివారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారిన పాలకొల్లు తహసీల్దార్ కార్యాలయం రోడ్డు

మండుతున్న ఎండలు..40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత

పాలకొల్లు అర్బన్, మార్చి 30 : ఇంకా వేసవి రాకముందే ఎండలు మండిపోతున్నాయి. నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 35 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు బయటకు రావాలంటే భయపడుతున్నారు. పాలకొల్లులో శనివారం వారపు సంత వెలవెలబోయింది. ఎండ వేడిమికి ప్రజలు అవస్థలు పడ్డారు. ఉదయం 10 గంటల నుంచి భానుడు ప్రతాపం చూపడంతో వీధులు నిర్మానుష్యంగా మారాయి.శీతల పానీయాలకు, కొబ్బరి బొండాలకు గిరాకీపెరిగింది.

జాగ్రత్తలు తప్పనిసరి



లంకల కోడేరు పీహెచ్‌సీ డాక్టర్ నవ్య

వేసలవిలో పిల్లలు, గర్భిణులు, వృద్ధులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని ఎండలు పెరిగిన దృష్ట్యా తగినన్ని జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ నవ్య పలు సూచనలు చేశారు.

వడదెబ్బ లక్షణాలు.. జాగ్రత్తలు

వడ దెబ్బ తగిలితే చెమట పట్టడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు రావడం, మగత నిద్ర, కలవరింతలు, ఫిట్స్, పాక్షికంగా అపస్మారక స్థితి ఏర్పడతాయి. అధిక ఉష్ణోగ్రత (వేడి) ఉండే సమయంలో బైట ఎక్కువగా తిరగ కూడదు. రోడ్లపక్కన విక్రయించే చల్లని రంగు పానీయాలు తాగరాదు, మాంసాహారం తగ్గించాలి. తాజా కూరగాయల్ని ఆహారంగా తీసుకోవాలి, మద్యం సేవించరాదు.

మంచినీరు, పండ్లరసాలు, కొబ్బరి నీళ్ళు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలి. నలుపురంగు మందంగా ఉండే దుస్తులకు బదులుగా లేత రంగులు కలిగిన తేలికైన కాటన్ దుస్తులు ధరించాలి. రోజూ కనీసం 15 గ్లాసుల నీళ్లు తాగాలి. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆహారం తక్కువగా ఎక్కువసార్లు తీసుకోవాలి. ఎండ వేళల్లో ఇంటిపట్టునే ఉండాలి. బయటికి వెళ్ళాల్సి వస్తే గొడుగు, టోపి వంటివి ధరించి వెళ్లడం మంచిది. ఇంట్లో కిటికీలు తెరచి ఉంచుకోవాలి.

ప్రథమ చికిత్స

వడదెబ్బ తగిలిన వారిని త్వరగా నీడ ఉండే ప్రదేశానికి చేర్చాలి. చల్లటి నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం అంతా తుడవాలి.శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకూ ఇలాగే చేస్తూండాలి. ఫ్యాను గాలి లేదా చల్లని గాలి తగిలే విధంగా చూసుకోవాలి.ఉప్పు కలిపిన మజ్జిగను కానీ కొద్దిగా ఉప్పు కలిపిన గ్లూకోజు ద్రావణం లేదా ఓరల్ రిహైడ్రేషన్ ద్వారణం (ఓఆర్ఎస్) తాగించాలి. వడదెబ్బ తగిలి అపస్మారక పరిస్థితిలో ఉన్నవారికి నీరు తాగించ కూడదు. వీలైనంత త్వరగా దగ్గరలోని ఆసుపత్రికి తరలించాలి.



పట్టిసీమ ఎత్తిపోతల వద్ద డీసిల్టింగ్ పనులు

పోలవరం, మార్చి 30 : పట్టిసీమ ఎత్తిపోతల పథకంలో డీసిల్టింగ్ పనులు చేపట్టినట్లు ఏఈ వినోద్ తెలిపారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకంలో 24 పంపులలో పేరుకు పోయిన సిల్టు తొలగింపు పనులు శిక్షణ పొందిన ఆరుగురు డ్రైవర్లతో ప్రారంభించడం జరిగిందని ఇప్పటి వరకూ రెండు పంపులలో సిల్టు తొలగించారని 3వ పంపులో సిల్టు తొలగింపు పనులు జరుగుతున్నాయని తెలి పారు. గోదావరిలో నీటి మట్టం తక్కువగా ఉండడం వల్ల పనులు ప్రారం భించామని మరో 21 పంపులలో సిల్టు తొలగింపు పనులు కూడా వేగవంతంగా జరుగుతాయని తెలిపారు.





తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కాలేజీ విద్యార్థినులు ఫీల్డ్ విజిట్‌లో భాగంగా తాడేపల్లిగూడెం ఆంధ్రజ్యోతి కార్యాలయాన్ని శనివారం సందర్శించారు. కాలేజీలో జర్నలిజం కోర్సు చదువుతున్న విద్యార్థినులకు 'వార్తల సేకరణ-ప్రింటింగ్ విధానం'పై కార్యాలయ ఉద్యోగులు అవగాహన కల్పించారు. బీఎం హరిబాబు, కాలేజీ జర్నలిజం కో-ఆర్డినేటర్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.



ద్వారకాతిరుమల ఆలయ హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

చిన వెంకన్న హుండీ ఆదాయం రూ.1.52 కోట్లు

ద్వారకాతిరుమల, మార్చి 30: ద్వారకా తిరుమలవాసునికి హుండీల లెక్కింపు ద్వారా గడచిన 17 రోజుల కాలానికి రూ.1.52 కోట్ల రూపాయల భారీ ఆదాయం సమకూరింది. ప్రమోద కల్యాణ మండప ఆవరణలో శనివారం హుండీ ఆదాయం లెక్కించారు. రూ.1,52,94,247 నగదుతో పాటు 320 గ్రాముల బంగారం, 3.392 కేజీల వెండి లభించినట్లు ఈవో త్రినాథరావు తెలిపారు. రద్దయిన పాతనోట్లు రూ.500 (7), 1000(3), 2000(14)తో పాటు విదేశీ కరెన్సీ లభించింది.

భక్తుల తాకిడి



శనివారం భక్తజనులతో కిటకిట లాడింది. ఉదయం నుంచే ఆలయానికి భక్తుల రాక ప్రారంభమైంది. దీంతో అన్ని విభాగాలు యాత్రికులతో సందడిగా మారాయి.వేలాది మంది యాత్రికులు క్షేత్రానికి చేరుకుని తమ మొక్కు బడులు తీర్చుకున్నారు. దాదాపు 20 వేల మంది వరకూ భక్తులు ఆలయానికి వచ్చినట్లు అధికారుల అంచనా.

శ్రీవారి క్షేత్రంలో వచ్చే నెల 9న ఉగాది ఉత్సవం

ద్వారకాతిరుమల, మార్చి 30 : శ్రీవారి క్షేత్రంలో వచ్చేనెల 9న ఉగాది ఉత్సవాన్ని నిర్వహిస్తామని ఆలయ ఈవో వేండ్ర త్రినాథరావు తెలిపారు. ఉగాది ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ పరిసరాలను పుష్పమాలికలు, మామిడి తోరణాలతో అలంకరిస్తామన్నారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు శ్రీవారు ఉభయదేవేరులతో శేషవాహనంపై కొలువై ఉగాది మండపం వద్దకు వస్తారని తెలిపారు. అనంతరం పంచాంగశ్రవణం, పండిత సత్కారం జరుగుతుందని తెలియజేశారు.

ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌కు అదనపు ఏసీ కోచ్

నరసాపురం, మార్చి 30: వేసవిలో ఏసీ బోగీలకు ఉండే రద్దీని పరిగణలోకి తీసుకుని నరసాపురం ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌కు అదనంగా మరో ఏసీ కోచ్‌ను కేటాయించారు. ప్రస్తుతం నాలుగు ఏసీ త్రీటైర్, మరో ఏసీ టూటైర్ కోచ్‌లతో ఈ ఎక్స్‌ప్రెస్ నడుస్తోంది. ఇవి కాకుండా ఏసీ ఫస్ట్ క్లాస్, సెకండ్ క్లాస్ సగం సగం సీట్లు కలిగిన మరో బోగీని అదనంగా జత చేస్తున్నారు. మే ఒకటి వరకు ఈ కోచ్ నడవనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది.



5 వరకు మారంపల్లి రైల్వే గేటు మూత

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 30: మండలంలోని మారంపల్లి రైల్వే గేటును శనివారం మూసివేశారు. అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఏప్రిల్ 5 వరకూ గేటును మూసివేస్తున్నట్టు రైల్వే అధికారులు బోర్డు ఏర్పాటుచేశారు. దీంతో జగన్నాథపురం, మాధవరం, దండగర్ర తదితర ప్రాంతాల వారు ఆరుళ్ల, మారంపల్లి వెళ్లాలంటే నవాబుపాలెం మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

క్రైం కార్నర్

గోదావరిలో మునిగి యువకుడి మృతి



పుల్లారావు(ఫైల్)

తాళ్లపూడి/చాట్రాయి, మార్చి 30: ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం చాట్రాయి మండలం నరసింహారావుపాలెం శివారు సి.గుడిపాడుకు చెందిన బిలుగుది పోతయ్య కుటుంబ సభ్యులతో మొక్కులు తీర్చుకునేందుకు శనివారం తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం వేగేశ్వ రపురంలోని మేరీమాత చర్చికి వచ్చారు. జపమాల ధరించిన వీరు గోదావరిలో స్నానాలకు వెళ్లగా వీరి కుమారుడు పుల్లారావు (20) ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయినట్టు పోతయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పుల్లారావు మృత దేహాన్ని నది నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శ్యాంసుందర్ తెలిపారు.

సి. గుడిపాడులో విషాద చాయలు

పుల్లారావు అవివాహితుడు. తల్లిదండ్రులు పోతయ్య, చుక్కమ్మలకు ఒక కుమార్తె, కుమారుడు. కుమార్తెకు వివాహమైంది. కుమారుడు పుల్లారావు పెళ్లిళ్ల, ఇతర శుభ కార్యాలకు డెకరేషన్ పనులు చేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. సి.గుడిపాడులో విషాద చాయలు నెలకొన్నాయి.

భీమవరంలో మావోయిస్టు అరెస్టు

భీమవరం క్రైం, మార్చి 30 : భీమవరంలో మావోయిస్టు అరెస్టు కలకలం రేగింది. శుక్రవారం అర్ధరాత్రి ఒక యువకుడ్ని పోలీసులు పట్టుకున్నారు. భీమవరం వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను తెలిపిన వివరాల ప్రకారం జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన నలుగురు మావోయిస్టులను కొంతకాలం క్రితం అక్కడ పోలీసులుఅరెస్టు చేశారు.వారితో ఉండే మరో మావోయిస్టు రాహుల్ కేసరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రాహుల్ కేసరి 15 రోజుల క్రితం భీమవరం వచ్చి తాపీ పనిచేస్తుకుంటూ భీమవరం ఏఎంసీలో ఉంటున్నాడు. కొంతకాలం హైద్రాబాద్‌లో తలదాచుకుని 15 రోజుల క్రితం భీమవరం వచ్చినట్లుగా తెలిసింది. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా జార్ఖండ్ పోలీసులు భీమవరం పోలీసుల సహాయం తీసుకుని జల్లెడపట్టి శుక్రవారం రాత్రి రాహుల్ కేసరిని భీమవరంలో అరెస్టు చేశారు. అతడిపై అరెస్టు వారెంటు ఉండటంతో పోలీసులు అతన్ని తీసుకువెళ్ళినట్టు సీఐ తెలిపారు.


విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్ మృతి

లింగపాలెం, మార్చి 30: లింగపాలెం మండలంలో విద్యుత్‌షాక్‌తో ఓ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బండారు లక్ష్మణరావు (55) అనే వ్యక్తి గ్రామంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం మండలంలోని అయ్యప్పరాజుగూడెం పంచాయతీ ప్రగతిపురం కాలనీలో ఓ ఇంట్లో విద్యుత్ పనులు చేస్తుండగా కరెంటు షాక్‌కు గురవడంతో వెంటనే గ్రామస్థులు, ఇంటి యజమాని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై పి.చెన్నారావు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అప్పటికే లక్ష్మణరావు చనిపోయినట్లు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.చెన్నారావు తెలిపారు.

మనస్థాపంతో ఆత్మహత్యాయత్నం

పాలకోడేరు, మార్చి 30 : మనస్తాపంతో ఒక వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గొల్లలకోడేరు గ్రామంలోని బీడులో శనివారం చోటు చేసుకుంది. బాబూరావు అనే వ్యక్తి మురుగు వెళ్లేందుకు ఇరిగేషన్ కాల్వగట్టుపై డ్రెయిన్ ఏర్పాటు చేసుకుంటున్నాడు. ఆ సమయంలో గ్రామానికి చెందిన గాడి ఉమా మహేశ్వరరావు అనే వ్యక్తి వచ్చి తన భార్య స్నానం చేస్తుండగా సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తుండడం బాబురావు చూసి ప్రశ్నించాడు. తనను తన ఓనర్ పంపించాడని డ్రెయిన్ ఫోటోలు తీయమన్నాడని బదులిచ్చాడు.ఈ సంఘటనతో మనస్థాపం చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.ఆసుపత్రిలో చికిత్స నుంచి కోలుకున్న బాబురావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీడియో చిత్రీకరిస్తున్న ఉమామహేశ్వరావుతో పాటు, ఓనర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాళం శ్రీనివాసరావు తెలిపారు. ఇదిలా ఉంటే ఇరిగేషన్ కాలువ గట్టుపై డ్రెయిన్ తవ్వుకుంటున్న కాటం బాబురావుపై ఇరిగేషన్ ఏఈ ప్రసాదరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నాటు తుపాకులు స్వాధీనం.. ఇద్దరి అరెస్టు



కైకలూరు, మార్చి 30: అనుమతులు లేకుండా నాటు తుపాకులను ఉపయోగిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్ తెలిపారు. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామవరంలో వేర్వేరు ప్రదేశాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా నాటు తుపాకులు కల్గిన వీరు తమిళనాడు రాష్ట్రానికి చెందిన ప్రవీణ్ స్మిత్, ఎడ్విన్ జాయ్‌గా గుర్తించామని, తుపాకులు స్వాధీనం చేసుకుని వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. ఎస్సై టి. రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన బైక్ ఒకరి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు



స్తంభాన్ని ఢీకొట్టిన బైక్.. మృతి చెందిన సాయికృష్ణ

ద్వారకాతిరుమల, మార్చి 30: మోటార్ సైకిల్‌కు కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి కరెంటు స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ద్వారకా తిరుమల మండలం కొమ్మర గ్రామానికి చెందిన సాయికృష్ణ, సంతోష్‌లు తాపీ పనిచేస్తుంటారు. శుక్రవారం సాయంత్రం తాపీపని డబ్బుల కోసం రాళ్లకుంట గ్రామానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రాత్రి వారి బైక్‌కు కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి కరెంటుస్తంభాన్ని ఢీకొట్టారు. దీంతో ఇద్దరి తలకు బలమైన గాయాల య్యాయి. స్థానికులు కుటుంబసభ్యులు వారిని వెంటనే ఏలూరు ఆసుపత్రికి తరలించారు. సాయికృష్ణ (19) పరిస్థితి విషమంగా ఉండటంతో అతన్ని విజయవాడకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న సంతోష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెబుతున్నారు. ద్వారకాతిరుమల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దువ్వ జాతీయ రహదారిపై కారు ప్రమాదం

తణుకు, మార్చి 30 : విజయవాడ నుంచి భీమవరం వెళుతున్న కారు దువ్వ కొత్త వంతెన సమీపంలో శనివారం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదం జరిగే సమయంలో కారులో నలుగురు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. అయితే కారు బెలూన్‌లో తెరచుకోవడంతో కారులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగ లేదు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో రోడ్డు భద్రతా సిబ్బంది ట్రాఫిక్‌ను అంతరాయం లేకుండా వాహనాలను పంపించారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

టి.నరసాపురం, మార్చి 30 : నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు హెచ్‌సీ ఎం.రాజు తెలిపారు.గండిగూడెం గ్రామంలో సారా విక్రయిస్తున్నారనే సమాచారంతో ఆదివారం సిబ్బందితో దాడి చేశారు. అతని వద్ద నుంచి ఆరు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.

సీ-విజిల్‌పై ప్రజలకు అవగాహన : ఆర్వో ముక్కంటి



సీ-విజిల్ అవగాహన బ్యానర్ విడుదల చేస్తున్న ఆర్వో ముక్కంటి

ఏలూరుసిటీ/ఏలూరు రూరల్, మార్చి 30 : ఎన్నికల నేపథ్యంలో ఎక్కడైనా అక్రమ మద్యం, నగదు, ఇతర బహుమతులు పంపిణీ, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించి ఫిర్యాదులను సీ-విజిల్ యాప్ ద్వారా సాధారణ ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం ముక్కంటి తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీ-విజిల్ అవగాహన బ్యానర్‌ను ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఫిర్యాదు చేసిన ఫిర్యాదుదారుడి సమాచారం గోప్యంగా ఉంచుతామన్నారు. సి-విజిల్‌పై ప్రజలకు మరింత అవగాహన కల్పించటం ద్వారా ఎన్నికలలో నగదు, మద్యం, బహుమతులు అక్రమ రవాణాను అరికట్టవచ్చన్నారు. తహసీల్దార్ వి.మురార్జి తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎస్ఐ రాజేంద్రప్రసాద్

పెదవేగి, మార్చి 30: ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం రాయన్నపాలెంలో పలు రాజకీయ పార్టీలు, పలువురు గ్రామ స్థులకు ఏర్పాటు చేసిన సదస్సులో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగితే ఓటింగ్ శాతం పెరుగుతుందన్నారు. ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సహకరిం చాల న్నారు. ఎన్నికల నిబంధనలకు లోబడి ప్రవర్తించాలని లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తోకలపల్లిలో ట్యాంకర్లతో నీటి సరఫరా



తోకలపల్లిలో ట్యాంకర్లతో నీటి సరఫరా

నిడమర్రు, మార్చి 30 : తోకలపల్లి గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం ఉంగుటూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేశారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలోని ఎస్సీ కాలనీ తదితర ప్రాంతాలలో నీటిని సరఫరా చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. జనసేన నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

'సత్యసాయి కార్మికులకు జీతాలు చెల్లించాలి'

ఏలూరుటూటౌన్, మార్చి 30: శ్రీసత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు కార్మికుల జీతాలు తక్షణమే చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు వీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల్లో 180 గ్రామాలకు గోదావరి జలాలను అందించే పథకం అన్నారు. దీనిలో 130 మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. వీరికి నాలుగు నెలలుగా జీతాలు అందక దుర్భర పరిస్థితి అనుభవిస్తున్నారన్నారు. వెంటనే జీతాలు చెల్లించని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. ఎస్.బాలజీ, శ్రీకాంత్, సత్యనారాయణ పాల్గొన్నారు.

'టీడీపీ వ్యతిరేకులను సస్పెండ్ చేస్తున్నాం'

ఉంగుటూరు,మార్చి 30 :ఉంగుటూరు మండల టీడీపీకి వ్యతిరేకంగా పనిచేసి శుక్రవారం రాత్రి నారాయణపురం పార్టీ మండల అధ్యక్షుడు పాతూరి విజయకుమార్, మాజీ ఎంపీపీ గోలి శ్రీనివాసరావులపై కొంతమంది పార్టీ శ్రేణులు భౌతిక దాడులు చేసిన విషయంపై పలు గ్రామాల పార్టీ నాయకులు సస్పెండ్ చేసినట్టు తీర్మానం చేశారు. శనివారం జరిగిన సమావేశంలో పార్టీకి వ్యతిరేకంగా నిర్ణయం చేసి కొందరిపై భౌతిక దాడులు చేయడం పార్టీ క్షమించదని ఈ విషయమై పార్టీ మండల అధ్యక్షుడు పాతూరి విజయకుమార్, మాజీ జడ్పీటీసీ చింతల శ్రీనివాస్ సమక్షంలో నల్లా ఆనంద్, సప్పా వీరబాబు, నక్కల గణేష్, పల్లి దానయ్య, బొడ్డు ప్రవీణ్ తదితరులను సస్పెండ్ చేసినట్టు తీర్మానించారు.

కమ్మరగూడెంలో డ్రెయినేజీ పూడికతీత పనులు

పోలవరం, మార్చి 30 :పోలవ రం పంచాయతీ కమ్మరగూడెం గ్రామంలో శనివారం పోలవరం సర్పంచ్ వై.కొండలరావు ఆధ్వర్యంలో డ్రెయినేజీ పూడికతీత పనులు నిర్వహించారు. పంచాయతీలో యడ్లగూడెం, కమ్మరగూడెం గ్రామాల్లో డ్రెయినేజీల పూడిక వల్ల నీరు నిల్వ ఉండి దుర్గంధం వస్తుందని వచ్చిన ఫిర్యాదుల మేరకు ఎక్స్‌కవేటర్ సాయంతో పూడికతీత చేయించి డ్రెయినేజీ వ్యవస్థలను పునరుద్ధరించారు. పోలవరం పంచాయతీ శానిటరీ మేస్త్రి బంగారు కృష్ణ ఇతర పారిశుధ్య కార్మికులు, స్థానిక నాయకులు గోకా హరికృష్ణ, కుంజం నాగబాబు, శివ పాల్గొన్నారు.

నిబంధనల మేరకే బోర్డులు, ఫ్లెక్సీలు తొలగించాం

బుట్టాయగూడెం, మార్చి 30 :పోలవరం ఎస్టీ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రైవేట్ ఆస్తుల నుంచి బోర్డులు, బ్యానర్లు, జెండాలు, స్టిక్కర్లను ఎన్నికల నిబంధనల మేరకే తొలగించామని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ శనివారం తెలిపారు. ప్రైవేట్ ఆస్తుల నుంచి రాజకీయ ప్రచార అంశాలను తొలగించేటప్పుడు కేంద్ర ఎన్నికల సంఘం జారీచేసిన మార్గదర్శకాలను పాటించామన్నారు.

గుండెపోటుతో వీఆర్వో పుల్లారావు మృతి

టి.నరసాపురం, మార్చి 30 :గుండెపోటుతో టి.నరసాపురం-2 వీఆర్వో హెచ్. పుల్లారావు (48) మృతి చెందిన సంఘటన శనివారం కె.జగ్గవరంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యు లు తెలిపిన వివరాలివి.. శనివారం తెల్లవారుఝామున వీఆర్వో అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు చింతలపూడి ప్రైవేటు ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఆయన స్వగ్రామం కె.జగ్గవరంలో అంత్యక్రియలు నిర్వహించారు. టి.నరసాపురం తహసీల్దార్ శుభాష్ సిబ్బందితో వచ్చి మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

పేద మహిళ కుటుంబానికి 'చేయూత' సాయం

పెదవేగి, మార్చి 30 : భర్త అకాల మరణం, ఇద్దరు చిన్నారుల భారం, ఉండేందుకు నీడకూడా లేని ఓ అభాగ్యురాలికి చేయూత సంస్థ ఆసరాగా నిలిచింది. పెదవేగికి చెందిన కందుల శివరాటాలు భర్త శివయ్య నాలుగు నెలల కిందట అకాల మరణానికి గురయ్యాడు. అప్పటికి ఆమె నిండు గర్భిణి, భర్త మరణించిన నెలకు ఓ బాబుకు జన్మనిచ్చిన ఆమె పెదవేగిలోని పుట్టింటి వద్ద నాలుగేళ్ళ పాపతో పుట్టింటి దగ్గర ఉంటున్న ఆమె దీనస్థితిని గమనించిన చేయూత సభ్యులు ఆమెకు రూ.పదివేలు, 25 కిలోల బియ్యం, నిత్యావసరాలను అందించారు. చేయూత సభ్యులు మేకా లక్ష్మీనారాయణ, రాజులపాటి చిన్నా, పరసా నాగార్జున, మరీదు లక్ష్మణరావు, వీరంకి శ్రీనివాసరావు, జి.దుర్గాప్రసాద్, ఏనుగు రామకృష్ణ ఉన్నారు.



బుట్టాయగూడెం, కుక్కునూరు మండలాల్లో పోలీస్ బలగాలతో కవాతు

పోలీసుల కవాతు

కుక్కునూరు/బుట్టాయగూడెం మార్చి 30 :రానున్న ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో సాయుధబలగాలతో కలసి కవాతు నిర్వహించామని కుక్కునూరు సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. శనివారం కుక్కునూరు మండలంలోని వేలేరు, వెంకటాపురం, బంజారగూడెం, ఉప్పేరు, చీరవల్లి, వింజరం, మారేడుబాక, కుక్కునూరు గ్రామాల్లో కవాతు నిర్వహించారు. బుట్టాయగూడెం మండలంలోని పలు గ్రామాల్లో జీలుగుమిల్లి సీఐ క్రాంతికుమార్, బుట్టాయగూడెం ఎస్ఐ కె.వెంకన్న శనివారం సాయంత్రం పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు.



ఏలూరు బీసీ సమావేశంలో పాల్గొన్న జనసేన, టీడీపీ నేతలు



భీమడోలులో గన్ని, ధర్మరాజును గజమాలతో సత్కరిస్తున్న పార్టీ నేతలు



వెంకటాపురంలో జనసేనలో చేరిన కార్యకర్తలతో మాట్లాడుతున్న మధుబాబు

బీసీల డీఎన్ఏ టీడీపీలోనే..

» ఏలూరు 4వ డివిజన్‌లో జయహో బీసీ సభ » కూటమి విజయం తథ్యం : ఏలూరు కూటమి అభ్యర్థి బడేటి చంటి

ఏలూరుటూటౌన్, మార్చి 30: బీసీల డీఎన్ఏ టీడీపీలోనే ఉందని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి, జనసేన ఇన్చార్జ్ రెడ్డి అప్పలనాయుడు, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ పేర్కొన్నారు. శనివారం ఏలూరు నాలుగో డివిజన్‌లో జయహో బీసీ సభ నిర్వహించారు. బీసీల రుణం తీర్చుకునేందుకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ బీసీ డిక్లరేషన్ ప్రకటించారన్నారు. బీసీలంతా సంఘటితమై వైసీపీని అంతం చేయాలన్నారు. బీసీలకు 50 ఏళ్లకే రూ.నాలుగువేల పింఛన్ అమలు చేస్తామన్నారు. బీసీ పారిశ్రామికవేత్తలకు రూ.10వేల కోట్లు కేటాయిస్తామన్నారు. పెళ్ళి కానుక, విదేశీ విద్య అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, అశోక్, సురేష్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక శ్రీరామ్‌నగర్‌లో ప్రజాసంకల్ప యాత్ర నిర్వహించారు. మినీ మేనిఫెస్టో కరపత్రాలు అందజేశారు. ప్రజాసహకారంతో టీడీపీ కూటమి అధికారంలోకి రావడం తథ్యమని చంటి అన్నారు. జి.శ్రీనివాస్, పి.విజయలక్ష్మి, పెద్దిబోయిన శివప్రసాద్, జనసేన నాయకులు కాశీనరేష్, ఎం.రంజిత్, లంకపల్లి మాణిక్యాలరావు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : రోషన్

జంగారెడ్డిగూడెం, మార్చి 30 : సూపర్ సిక్స్ పథకాలను ప్రతి ఇంటికి తీసుకువెళ్లి తెలియజేయాలని చింతలపూడి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. శనివారం జంగారెడ్డిగూడెం మండల టీడీపీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ లెవెల్ కన్వీనర్లు అందరూ ప్రతీ ఓటర్ని కలవాలని, సూపర్ సిక్స్ పథకాలను ప్రతీ ఇంటికి తీసుకెళ్లాలని కోరారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్‌చంద్రశేషు, మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, కార్యదర్శి కుక్కల మాధవరావు, గోలి అనిల్, ఎలికే ప్రసాద్, గొల్లమందల శ్రీను, శీలం రామచంద్రరావు, ముళ్ళపూడి గంగాధరశ్రీనివాస్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు బలుసు కిరణ్‌కుమార్, తానిగడప నరేష్‌కుమార్, చిలపరెడ్డి ఇంద్రాణి, దండే పద్మ, ఆరుగొల్లు గంగ, అనసూయ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. సాయంత్రం అక్కంపేట గ్రామంలో శంఖారావం కార్యక్రమంలో రోషన్‌కుమార్ పాల్గొని సూపర్ సిక్స్ పథకాలను స్థానికులకు వివరించారు.

ఎంపీ అభ్యర్థి మహేష్‌కు ఎమ్మార్పీఎస్ మద్దతు

ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ విజయానికి ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కందుల రమేష్ అన్నారు. టీడీపీ కార్యాలయంలో మహేష్‌ను కందుల రమేష్ బృందం మర్యాదపూర్వకంగా కలిసింది.



జంగారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న సొంగా రోషన్‌కుమార్

కామవరపుకోటలో టీడీపీ కార్యాలయం ప్రారంభం

కామవరపుకోట , మార్చి 30. చింతలపూడి నియోజకవర్గంలోని కామవరపుకోటలో శనివారం తెలుగు దేశం పార్టీ కార్యాలయాన్ని కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే గంటా మురళీరామకృష్ణ, టీడీపీ నాయకులు కోనేరు వెంకటసుబ్బారావు, గంటా సుధీర్‌బాబు పాల్గొన్నారు.

రోషన్‌కుమార్‌ను గెలిపించాలి : మధుబాబు

చింతలపూడి, మార్చి 30: రానున్న ఎన్నికల్లో చింతలపూడి కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ విజయానికి జనసైనికులు సంఘటితంగా పనిచేసి గెలిపించాలని జనసేన మండలశాఖ అధ్యక్షుడు చీదరాల మధుబాబు అన్నారు. శనివారం వెంకటాపురం గ్రామంలో జరిగిన సమావేశంలో గ్రామానికి చెందిన 70 మంది వైసీపీ కార్యకర్తలు జనసేనలో చేరారు. వీరిని పార్టీలోకి ఆహ్వానిస్తూ ఆయన కండువాలు కప్పారు. పార్టీ బలోపేతంతో పాటు కూటమి అభ్యర్థి విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పి.బాలాజి, కె.ఫణీంద్ర, వంశీకృష్ణ, కె.అప్పారావు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావాలని..



జంగారెడ్డిగూడెం, మార్చి 30 : 'రాష్ట్రం సర్వనాశనం అయింది. టీడీపీ అధికారం చేపట్టాలి. చంద్రబాబునాయుడు సీఎం కావాలి.. యువతకు మంచి భవిష్యత్ ఉండాలి' అని జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకురాలు పగడం సౌభాగ్యవతి కుమారుడు దినేష్ మోకాళ్ల నడక చేపట్టారు. తమిళనాడులోని వేలాంగిణి మాత ఆలయం వెలుపల నుంచి రెండు కిలోమీటర్లు మోకాళ్లపై నడుచుకుంటూ వెళ్లి మాతను దర్శించుకున్నారు. దినేష్ కుటుంబం టీడీపీ అభిమానులు. గతంలోను టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత లోకేశ్ మంత్రి బాధ్యతలు చేపట్టిన అనంతరం మోకాళ్లపై నడిచి తన మొక్కును తీర్చుకున్నారు. లోకేశ్ చేపట్టిన యువగళం యాత్ర విజయవంతం కావాలని మాతను వేడుకున్నట్టు చెప్పారు. ప్రసుతతం రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించాలంటని చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని మరోసారి మోకాళ్లపై నడిచారు.



పాదయాత్రలో పత్సమట్ల ధర్మరాజు, గన్ని గోపాలం తదితరులు

కొనసాగిన ధర్మరాజు పాదయాత్ర

ఉంగుటూరు/భీమడోలు, మార్చి 30:జనసేన ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు పాదయాత్ర శనివారం కైకరం మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయనతో పాటు భీమడోలు సొసైటీ మాజీ అధ్యక్షుడు గన్ని గోపాలం, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చింతల శ్రీనివాస్, కైకరం సర్పంచి సలగాల గోపి, నెక్కలపూడి సత్యనారా యణ, బొమ్మిడి అప్పారావు, జనసైనికులు లింగంపల్లి మణికంఠ, పంది రాంబాబు, ఉన్నమట్ల సునీత, యెగ్గిన శ్యామల, బొడ్డు శాంతకుమారి పాల్గొన్నారు. అనంతరం భీమడోలు మండలం పోలసానపల్లి గ్రామంలో పాదయాత్ర ముగిసింది. భీమడోలుకు చేరుకున్న పాదయాత్రలో గన్ని వీరాంజనేయులు పాల్గొని నియోజకవర్గ అభివృద్ధి కోసం, రాష్ట్ర భవిష్యత్తు కోసం కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన అసవరం ఉందని అన్నారు. నియోజకవర్గ అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు గ్లాసు గుర్తుకు, ఏలూరు పార్లమెంటు కూటమి అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఏలూరు పార్లమెంటు కూటమి అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ పాల్గొన్నారు. పాదయాత్రలో పెద్దఎత్తున నియోజకవర్గం నుంచి మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు, జనసేన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

కామినేనిని గెలిపించాలి : విక్రమ్‌కిషోర్

ఏలూరుటూటౌన్, మార్చి 30: కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించేం దుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కిషోర్ పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆత్మీయ సమావేశం జరిగింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.లక్ష్మీనారాయణ, పార్లమెంట్ కన్వీనర్ కృష్ణప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి శరణాల మాలతీరాణి, మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మలకిషోర్, కిషాన్ మోర్చ నాయకులు రామచంద్రరాజు, తదితరులు పాల్గొన్నారు.

గౌరవంగా పదవీ విరమణ పొందడం అదృష్టం : ఎస్పీ



పదవీ విరమణ పోలీసు అధికారులను సన్మానించిన ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు క్రైం, మార్చి 30 : ప్రజల కోసం అహర్నిశలు కృషి చేసి గౌరవప్రదంగా పదవీ విరమణ పొందడం అదృష్టమని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తున్న పలువురు అధికారులు, సిబ్బంది పదవీ విరమణ సందర్భంగా ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో వారిని సత్కరించారు. ఏలూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న ఎం. నాగేశ్వరరావు (ఎస్ఐ 592), వేలేరుపాడు ఏఎస్ఐ అటాచ్డ్‌టు డీసీఆర్బీ కె.హనుమంతరావు, జీలుగుమిల్లి ఏఎస్ఐ అటాచ్డ్‌టు డీసీఆర్బీ కె. మనోహర్ కుమార్, ఏలూరు జిల్లా ఆర్మ్‌డ్ విభాగంలో పనిచేస్తున్న జె.మారయ్య, ఏలూరు సీసీఎస్ హెడ్‌కానిస్టేబుల్ సీహెచ్ సీతయ్య, జిల్లా పోలీస్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ కె.హేమలత పదవీ విరమణ పొందారు. వీరిని సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఎక్కువ కాలం పనిచేసి సేవలు అందించడం అభినందనీయం అన్నారు. పదవి విరమణ అనంతరం ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనకు తెలియజేయాలని సూచించారు. అదనపు ఎస్పీ జి.స్వరూపరాణి, పెదవేగి డీటీసీ డీఎస్పీ ప్రభాకరరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీధర్‌రావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఏఆర్ఆర్ఐ పవన్‌కుమార్, ఏలూరు జిల్లా పోలీస్ అసోసియేషన్ సభ్యులు నాగేశ్వరరావు, శానం రమేష్‌బాబు పలువురు పాల్గొన్నారు.

శివరామకృష్ణకు పదవీ విరమణ సన్మానం

లింగపాలెం, మార్చి 30: లింగపాలెంలోని మండల విద్యావనరుల కేంద్రంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న శివరామకృష్ణ పదవీవిరమణ చేశారు. శనివారం ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు కె.రామారావు, జె.రవీంద్ర, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది శివరామకృష్ణను సన్మానించారు. ఉపాధ్యాయులు శివరామకృష్ణకు రూ.1,30,500 అందజేశారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గర్భస్థ లింగ పిండ నిర్ధారణ నియంత్రణ చట్టం పటిష్ఠంగా అమలు చేయాలి : ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

ఏలూరు కలెక్టరేట్, మార్చి 30:గర్భస్థ లింగ పిండ నిర్ధారణ నియంత్రణ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని ఏలూరు ఆర్డీవో ఎన్.ఎస్.కె ఖాజావలీ అధికారులను ఆదేశించారు. శనివారం ఆర్డీవో కార్యాలయంలో ఏలూరు డివిజన్ స్థాయి గర్భస్థ లింగ పిండ నిర్ధారణ నియంత్రణ చట్టం అమలు కమిటీ సమావేశం జరిగింది. ఆర్డీవో మాట్లాడుతూ ఈ చట్టం అమలు చేయని స్కానింగ్ సెంటర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. స్కానింగ్ సెంటర్లపై కమిటీ సభ్యులు నిఘా పెట్టాలని సూచించారు. చట్టం అతిక్రమిస్తే స్కానింగ్ కేంద్రాలను సీజ్‌చేసి యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో ఏలూరు డీఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి నాగేశ్వరరావు, కమిటీసభ్యులు రంగారావు, సత్యరవి పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక ఉపనయన కార్యక్రమం

ఏలూరు కల్చరల్, మార్చి 30:స్థానిక పవర్‌పేటలోని స్మార్త వేద పాఠశాలలో శనివారం అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘ ఆధ్వర్యంలో సామూహిక ఉపనయన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఎనిమిది మంది బ్రాహ్మణ వధువులకు ఉపనయనం చేయగా, వేదపండితులు శాస్త్రోక్తంగా కార్యక్రమం నిర్వహించారు. ఉపనయనానికి వచ్చిన వటువులకు వసతి కల్పించడంతో పాటు కార్యక్రమానికి అవసరమైన దీక్షావస్త్రాలు సమకూర్చారు. ఈ సందర్భంగా సంస్థ లీగల్ అడ్వైజర్ సీఏపీ రామానుజాచార్యులు, జిల్లా అధ్యక్షుడు మైలవరపు గురుశర్మ మాట్లాడారు. అనంతరం వటువులతో పాటు తల్లిదండ్రులు, బంధువులకు ఉచిత భోజన ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణసంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



నాట్యం చేస్తున్న చిన్నారులు

ఏలూరు రూరల్, మార్చి 30 : శనివారపుపేట శ్రీరామ్‌నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంఈవో ఆర్.రంగయ్య ముఖ్యఅతి థిగా పాల్గొని ప్రసంగిం చారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని చదువుతోనే దేశప్రగతి సాధ్యమవుతుందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల హెచ్ఎం ఆర్.నాగేంద్రసింగ్, ఎస్.అనిత తదితరులు పాల్గొన్నారు.

'ఆదివాసీల హక్కులను హరిస్తున్న ప్రభుత్వాలు'

బుట్టాయగూడెం, మార్చి 30 : ఆదివాసీల హక్కులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తున్నాయని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పోరండ్ల శ్రీనివాస్ తెలిపారు. శనివారం చింతపల్లిలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఏజెన్సీ ఏరియా ముఖ్యకార్యకర్తల సమావేశం కెచ్చెల ముక్కారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలకు రక్షణగా ఉన్న చట్టాలకు సవరణ చేసి వారి హక్కులను హరించడమే కాకుండా అటవీ ప్రాంతంలో నివసించే ఆదివాసీల హక్కులను తొలగిస్తున్నారని, తరతరాలుగా అడవిలో ఉంటున్నవారిని బయటకు పంపాలనే కుట్రతో చట్టాలకు సవరణలు చేస్తున్నారని తెలిపారు. నాయకులు కురసం లత, నడపల ముక్కారెడ్డి, అరగంటి బాబుల్‌రెడ్డి, మాంద్రు చల్లారెడ్డి, గురుగుంట్ల రంగారెడ్డి, నడపల చిన్నారెడ్డి, మాంద్రు గంగిరెడ్డి, చదల లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

లింగపాలెం, మార్చి 30: ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఎంపీడీవో రాంబాబు తెలిపారు. శనివారం మండలంలోని లింగపాలెం, మఠంగూడెం, అయ్యప్పరాజుగూడెం గ్రామాల్లో బుర్రకథ కళాకారులచే ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బుర్రకథ కళాకారులు ఎం.చిరంజీవి, ఎం.రత్నరాజు, వీఆర్వో ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి గణేష్, ఆయా గ్రామాల రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

జంగారెడ్డిగూడెం, మార్చి 30 :జంగారెడ్డిగూడెం ప్రతిభ ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ కాసర సత్యనారాయణరెడ్డి మనుమరాలు ప్రతిభా సరోజా రెడ్డి జన్మదినం సందర్భంగా స్థానిక సీతామహాలక్ష్మి స్వచ్ఛంద సంస్థలో ఉన్న వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. రూ.25 వేలును సేవా సంస్థ నిర్వహణకు నిర్వాహకుడు జయవరపు శేఖర్‌కు అందజేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మీ సరోజా రెడ్డి, సింధూషారెడ్డి, శుభాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వడదెబ్బ నివారణ అంశాలపై అవగాహన

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 30 : 'వడదెబ్బ-నివారణ మార్గాలు, ఇతర అంటువ్యాధులపై అవగాహన అనే అంశాలపై శనివారం స్థానిక కస్తూరిబా మున్సిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు జిల్లావైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు మాట్లాడుతూ తీవ్రమైన ఉష్ణోగ్రతల కారణంగా ఆరుబయట ప్రాంతాల్లో విద్యార్థులు ఆటలు ఆడటం మంచిదికాదన్నారు. విద్యార్థులు ఎక్కువగా నులిపురుగు వ్యాధికి గురయ్యే అవకాశం ఉందని, భోజనానికి ముందు చేతులను సబ్బునీటితో పరిశుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. స్కూలు హెచ్ఎం సునీత, వైద్యసిబ్బంది శ్రీనివాసరావు, జైనాబ్, సునీత, రత్నకుమారి, ఉపాధ్యాయులు ప్రసన్న, కృష్ణమోహన్, సుబ్బారావు పాల్గొన్నారు.

యోగా కోర్సు విద్యార్థులకు సర్టిఫికెట్లు



సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 30 :'యోగా ఫర్ బెటర్‌లైఫ్' 45రోజుల సర్టిఫికెట్ కోర్సుని ముగించుకున్న స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శనివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో సర్టిఫికెట్లను అందజే శారు. ప్రిన్సిపాల్ గిరిబాబు, యోగా ట్రైనర్ ఆదినారాయణ మాట్లాడుతూ యోగా సాధనతో విద్యార్థులు మానసిక, భౌతిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచు కోగలరన్నారు. కోర్సుని పూర్తి చేసుకున్న విద్యార్థులు నిత్యం సాధన చేస్తుండాలని సూచించారు. కోర్సు కో-ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ ఉదయలక్ష్మి, డిప్యూటీ కో-ఆర్డినేటర్ దుర్గాప్రసాద్, హేలాపురి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కేబీరావు, కళాశాల అభివృద్ధి, ప్రణాళికమండలి సభ్యుడు లేళ్ళ వెంకటేశ్వరరా వు, క్లబ్ కార్యదర్శి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సరమ్మపేరంటాలు ఉత్సవాలు



విద్యుత్ వెలుగులలో సరమ్మ పేరంటాలు ఆలయం

లింగపాలెం, మార్చి 30:లింగపాలెంలో సరమ్మపేరంటాలు తిరునాళ్ళ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఏళ్ల చరిత్ర కలిగిన సరమ్మపేరంటాల తల్లి ఆలయంలో భక్తులు కోరిన కోర్కెలు తీర్చేతల్లిగా పేరొందింది. వేలాదిమంది భక్తులు తిరునాళ్లకు హాజరై మొక్కులను చెల్లించుకున్నారు. పలు అలంకరణలతో స్వామి, అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు తాతిన రాధాకృష్ణ, చిలకబత్తుల శ్రీనివాసరావు, భీమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అంగడాల రేవంత్ పాల్గొన్నారు.

వైభవంగా రామాలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠ

పెదవేగి, మార్చి 30 :కొప్పాక ఎర్రచెరువు గట్టుమీద రామాలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల వేద మంత్రోచ్చరణలు, హోమాల అనంతరం శనివారం ఉదయం హనుమత్, సీతా, రామ, లక్ష్మణ సమేత కోదండరామస్వామి వార్ల ఆలయ విగ్రహ, ధ్వజ, శిఖర పరివార అభినవ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిపారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తపన ఫౌండేషన్ అధినేత గారపాటి సీతారామాంజనేయ చౌదరి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, కొప్పాక సొసైటీ అధ్యక్షుడు చల్లగొళ్ళ వెంకటేశ్వరరావు భక్తులు పాల్గొన్నారు.

రెండు నుంచి చెన్నకేశవుడు బ్రహ్మోత్సవాలు

ఏలూరు కల్చరల్, మార్చి 30: ద్వారకాతిరుమల దత్తత క్షేత్రమైన శనివారపుపేట, చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తామని ఈవో వేండ్ర త్రినాథరావు ఓ ప్రకటనలో తెలిపారు. 2న స్వామి అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెను చేయుట, 4న ఎదుర్కోలోత్సవం, 5న దేవిభూదేవిసమేత చెన్నకేశవస్వామి దివ్యకల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. 6న నిత్యహోమం, గ్రామోత్సవం, 7న చక్రస్నానం, 8న పవళింపు సేవ ఉంటుందన్నారు.

● జంగారెడ్డిగూడెం, మార్చి 30 : జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామిని శనివారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సుప్రభాత సేవ, ఆరాధన, తోమాలసేవ, తీర్థప్రసాదగోష్ఠి అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించారు. భక్తులు ఆలయ ప్రదక్షణలతో మొక్కులు తీర్చుకున్నారు.

● నిడమర్రు మార్చి 30 : ఛానమిల్లి గ్రామ దేవత శ్రీపల్లాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా శనివారం గవరగుడుపు సేవ ఘనంగా నిర్వహించారు. గరగనృత్యాలు, నాదస్వరం, డప్పులు, భేతాళ నృత్యాలతో సాగిన సేవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

చింతలపూడి బార్ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు



నాగేశ్వరరావు



చైతన్య

చింతలపూడి, మార్చి 30: చింతలపూడి బార్ అసోసియేషన్ ఎన్నికలు శనివారం జరిగాయి. గౌరవఅధ్యక్షుడిగా కాకర్ల మాణిక్యాలరావు అధ్యక్షుడిగా బలుసు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఎల్.వి చైతన్య, ఉపాధ్యక్షులుగా విజయరావు, ఫణిదీప్ ఇరువురికి సమాన ఓట్లు రావడంతో డ్రా తీయగా ఫణిదీప్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైనట్టు ప్రకటించారు. కార్యదర్శిగా విజయ్‌రావును ఎన్నుకున్నారు. ఎన్నికలను రంజిత్‌కుమార్, పట్నాల ప్రసాద్, నాగార్జున నిర్వహించారు.

దోసపాడు దళితులపై పోలీసుల నిర్బంధం తగదు

ఏలూరుటూటౌన్, మార్చి 30:దోసపాడులో పట్టాభూముల కోసం పోరాడుతున్న దళితులపై పోలీసులు మోహరించి బెదిరించటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. శనివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆర్.లింగరాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. రవి మాట్లాడుతూ 1956 నుంచి దఫదఫాలుగా దళితులకు సీలింగ్, అసైన్డ్‌భూముల పట్టాలిచ్చారన్నారు. వాటిని విజయవాడకు చెందిన కొంతమంది భూస్వాములు ఆక్రమించుకుని చేపలు, రొయ్యలు సాగు చేస్తున్నారన్నారు. మా భూములు మాకు ఇచ్చేయాలంటూ 15 ఏళ్లుగా దళితులు, పేదలు, పోరాడుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో అక్కడ వైసీపీ ప్రభుత్వం 145సెక్షన్ విధించి దళితుల, పేదల ఇళ్లు మోహరించారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పోలీసులను వెనక్కి రప్పించి భూస్వాముల నుంచి పేదల భూములు కాపాడాలన్నారు.



యువత ఓటు హక్కు వినియోగించుకోవాలి

కైకలూరు, మార్చి 30: ఓటు హక్కును యువత అవగాహనతో సద్వినియోగం చేసుకోవాలని కైకలూరు రిటర్నింగ్ అధికారి కె. భాస్కర్ అన్నారు. శనివారం కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ కొత్తగా ఓటు హక్కు పొందినవారు దానిని ఎలా వినియోగించుకోవాలో వివరించారు. అలాగే అర్హులై ఉండి ఓటు లేనివారు ఏప్రిల్ 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎవరైనా ప్రలోభాలకు గురిచేసినా తక్షణమే ఎన్నికల అధికారులకు సమాచారమందించాలన్నారు. తహసీల్దార్ ఎస్. పోతురాజు, ఎంపీడీవో ఉమా మహేశ్వరరావు, రూరల్ సీఐ కృష్ణకుమార్, ఎస్సై టి రామకృష్ణ, అధ్యాపక బృందం పాల్గొంది.

మండవల్లి: ప్రజాస్వామ్య పరిరక్షణ, భావితరాల అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం ఓటు హక్కు వినియోగించుకోవటం పౌరులందరి విధి అని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, టి. అప్పారావు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అసోసియేషన్ మండవల్లి అధ్యక్షుడు కొరపాటి శాంతరాజు అన్నారు. ఐక్యవేదిక మండల శాఖ ఆధ్వర్యంలో మండవల్లిలో ఓటు హక్కు వినియోగంపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. గోరింక గాంధీ, కొండపల్లి రవిప్రసాద్, బేతపూడి తంబి, దాకరపు వినోద్, కాశీ, బుద్దుల రాముడు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి కూటమిలో చేరిక

కైకలూరు, మార్చి 30: వరహాపట్నంలో కామినేని శ్రీనివాస్ ఇంటి వద్ద శనివారం మండవల్లి ఎంపీటీసీ గూడపాటి ఝాన్సీ భర్త లోకనందనకుమార్, అలాగే పంచాయతీ 9వ వార్డు సభ్యుడు బొల్లవరపు ఆంజనేయులు టీడీపీ మండల అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు చాబత్తిన విజయ్ ఆధ్వర్యంలో కామినేని శ్రీనివాస్ సమక్షంలో టీడీపీలో చేరారు. అలాగే వరహాపట్నం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు అందుగుల యాకోబు, అందుగల విజయకుమార్, పళ్లెం నాగస్వామి, నూక పెయ్యి, శ్రీరాములు, కూన అబ్రహం దాసు ఎన్డీయే కూటమిలో చేరారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ వైసీపీ పాలనలో అరాచకాలను తట్టుకోలేక ప్రజలంతా ఎన్డీయే కూటమిని కోరుకుంటున్నారని రాష్ట్రానికి మంచి చేయాలని ప్రజలు సంకల్పిస్తున్నారని, వారి నమ్మకం వమ్ము కాకుండా గ్రామాలను అభివృద్ధి చేస్తానన్నారు.

కలిదిండి: మండలంలోని కోరుకొల్లు, ఆవకూరు గ్రామాల వైసీపీ నాయకులు నూకల శ్రీనివాస్, చెన్నంశెట్టి తులసి, ఆమజాల రామసాయి, ఇర్రింకి శ్రీరామకృష్ణ, కొప్పర్తి నరేష్, అందె జగదీష్, జొన్నలగడ్డ రాము, చలమలశెట్టి ఫణీంద్ర, సురేష్, రత్నకుమార్, దాసరి రాంబాబు, నరహరిశెట్టి దుర్గారావులు శనివారం వరహాపట్నంలో కూటమి అభ్యర్థి కామనేని శ్రీనివాస్ సమక్షంలో కూటమిలో చేరారు. కామినేనికి మద్దతు పలికారు.

బొడ్డు నోబుల్ కాంగ్రెస్‌లో చేరిక



కైకలూరు, మార్చి 30: కైకలూరు వైసీపీ నాయకుడు బొడ్డు నోబుల్ ఆ పార్టీకి రాజీనామా చేసి శనివారం విజయవాడలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి పనిచేసి వైసీపీలో దళిత నాయకుడిగా ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానని అందువల్లనే పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. నోబుల్‌తో పాటు సొసైటీ మాజీ అధ్యక్షుడు ఒరుగంజి సామియేలు రాజు, ఆచవరం మాజీ సర్పంచ్ దండే సైమన్‌రాజు, కలిదిండి మండల వైసీపీ నాయకులు ఈదా పద్మారావు, ప్రత్తిపాటి అలెక్స్, పల్లెవాడ వైసీపీ నాయకులు బుంగా కాసురాజు, దొడ్డిపట్ల కూనాల జయరాజు, వాసిపల్లి రమేష్‌తో పాటు 300 మంది కాంగ్రెస్‌లో చేరారు. వీరందరికీ షర్మిల కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

కలిదిండి, మార్చి 30 : కలిదిండి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ 1 నుంచి 25వ తేదీ వరకు పాలిసెట్ పరీక్షకు ఉచిత శిక్షణ ఇస్తున్నామని ప్రిన్సిపాల్ డి.ప్రసాద్ తెలిపారు. ఏప్రిల్ 27న పాలిసెట్ పరీక్ష జరుగుతుందన్నారు. ఏప్రిల్ 5వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదవ తరగతి విద్యార్థులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

యోగా శిక్షణ



ఆగిరిపల్లి, మార్చి 30: మండల పరిధిలోని పాఠశాలల్లో యోగా శిక్షణ ఇస్తున్నట్లు హోమియో వైద్యురాలు డాక్టర్ రజిత తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం కోసం ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ఉచిత యోగా శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. యోగా గురువులు కుమార్, జ్యోతి కుమారి ద్వారా నెలలో 12 క్లాసులు తీసుకుంటామని తెలిపారు. అలాగే ఆగిరిపల్లి బ్రాహ్మణ బజారులో ఉన్న గరికపాటి పిరమిడ్ కేంద్రం ద్వారా వయోజనులకు, మహిళలకు ఉచిత యోగాశిక్షణ ఇస్తున్నట్టు, ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆరోగ్యవంతులు కావాలని ఆమె కోరారు.

క్రైం కార్నర్

గోదావరిలో మునిగి యువకుడి మృతి


బి. పుల్లారావు (ఫైల్)

తాళ్లపూడి/చాట్రాయి, మార్చి 30: ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం చాట్రాయి మండలం నరసింహారావుపాలెం శివారు సి. గుడిపాడుకు చెందిన బిలుగుది పోతయ్య కుటుంబ సభ్యులతో మొక్కులు తీర్చుకునేందుకు శనివారం తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం వేగేశ్వరపురంలోని మేరీమాత చర్చికి వచ్చారు. జపమాల ధరించిన వీరు గోదావరిలో స్నానాలకు వెళ్లగా వీరి కుమారుడు పుల్లారావు (20) ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయినట్టు పోతయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్యాం సుందర్ తెలిపారు. పుల్లారావు మృతదేహాన్ని నది నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు తెలిపారు.

సి. గుడిపాడులో విషాద చాయలు

పుల్లారావు అవివాహితుడు. తల్లిదండ్రులు బిలుగుది పోతయ్య, చుక్కమ్మలకు ఒక కుమార్తె, కుమారుడు. కుమార్తెకు వివాహమైంది. కుమారుడు పుల్లారావు పెళ్ళిళ్ళు, ఇతర శుభ కార్యాలకు డెకరేషన్ పనులు చేస్తు కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. సి. గుడిపాడులో విషాదం చాయలు నెలకొన్నాయి.



నాటు తుపాకుల స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

కైకలూరు, మార్చి 30: అనుమతుల్లేకుండా నాటు తుపాకులను ఉపయోగిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్ తెలిపారు. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామవరంలో వేర్వేరు ప్రదేశాల్లో అనుమతుల్లేకుండా నాటు తుపాకులు కల్గిన నిందితులను తమిళనాడుకు చెందిన ప్రవీణ్ స్మిత్, ఎడ్విన్ జాయ్‌గా గుర్తించామని, తుపాకులు స్వాధీనం చేసుకుని వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. ఎస్సై టి. రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

కలిదిండి, మార్చి 30 : కోరుకొల్లులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పంపన భాస్కరరావు అనే నిందితుడిని శనివారం అరెస్టు చేసి అతని నుంచి 21 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ప్రియకుమార్ తెలిపారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


పోల్‌రాజ్ మేజర్ డ్రైన్‌లో ఇసుక మేటలు


పూడిపోయిన పెదలంక మేజర్ డ్రైన్.. వర్షం వస్తే మునకే(ఫైల్)


తుమ్మడి చెన్నూరు డ్రైన్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్క

నిధుల్లేవు.. నిర్వహణ లేదు

డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణ లోపభూయిష్టంగా మారింది. లక్షలాది ఎకరాల పంట భూములకు అతి ముఖ్యమైన మురుగునీటి పారుదల సౌకర్యం కల్పించే డ్రైన్లు ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోకపోవటంతో తరచూ సంభవిస్తున్న తుఫానుల వల్ల కోట్లాది రూపాయల విలువైన పంట నష్టం జరుగుతోంది. మేజర్, మీడియం, మైనర్ డ్రైన్ల పర్యవేక్షణ కూడా కొరవడింది. ఇందుకు ప్రత్యేకంగా డ్రైనేజీ శాఖ ఉన్నప్పటికీ పెద్దగా ప్రయోజనం లేకుండా పోతున్నది. గుర్రపు డెక్క ఇసుక మేటల తొలగింపు పనులు కూడా చేపట్టకుండా డ్రైనేజీ శాఖ అవలంబిస్తున్న వైఖరి రైతులకు శాపంగా మారింది.

- అన్నదాతకు శాపంగా డ్రైనేజీ వ్యవస్థ
- ఆధునికీకరణ ఊసే లేదు.. తుపాన్లకు మునుగుతున్న చేలు
- పట్టించుకోని అధికారులు
- రైతుల కష్టాలు తీరేదెన్నడో?

ముదినేపల్లి, మార్చి 30 : డ్రైన్ల ఆధునికీకరణతోపాటు డెల్టాలోని మేజర్, మీడియం, మైనర్ డ్రైన్ల నిర్వహణకు డ్రైనేజీ శాఖ వద్ద ఒక కార్యాచరణ ప్రణాళిక కూడా లేదు. ముఖ్యంగా కృష్ణా తూర్పు డెల్టాకు శివారున ఉన్న కైకలూరు నియోజకవర్గంలోని డ్రైన్ల పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. పై ప్రాంతాల ఆయకట్టు నుంచి వచ్చే మురుగు నీరంతా ముదినేపల్లి, మండవల్లి, కైకలూరు, కలిదిండి, బంటుమిల్లి, పెడన, గుడివాడ రూరల్ మండలాలకు చెందిన లక్షలాది ఎకరాల పంట భూముల్లో చేరుతోంది. పోల్ రాజ్, పెదలంక, చినకొమ్మిలేరు, పెదకొమ్మిలేరు, కోరుకొల్లు వంతెన వరకు ఇసుక మేటలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. దీంతో నీరు కదలక ముదినేపల్లి మండలంలోని ఆయకట్టులో పంటలు దెబ్బతింటున్నాయి. కోరుకొల్లు దిగువన ఇటీవల కోట్లాది రూపాయల వ్యయంతో చేసిన డ్రెడ్జింగ్ పనులు ఆయకట్టుకు పెద్దగా మేలు చేయలేదు.

పర్యవేక్షణ కరువు

డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణకు మూల స్తంభాలు మజ్దూర్ ఉద్యోగులు. గతంలో కైకలూరు సబ్ డివిజన్ పరిధిలోని డ్రైన్లపై 14 మంది మజ్దూర్ ఉద్యోగులు ఉండేవారు. ఇప్పుడు ఒక్కరు కూడా లేరు. ఆ ఉద్యోగులు తరచూ డ్రైన్లపై తిరుగుతూ వంతెనలు, ఇతర ప్రదేశాల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూటుకాడను తొలగిస్తూ ఉండేవారు. ప్రస్తుతం ఆ ఉద్యోగులు లేకపోవటం, పై అధికారులు పర్యవేక్షించకపోవటంతో డ్రైన్ల నిర్వహణ లోపభూయిష్టంగా మారింది.

కొల్లేరు, ఉప్పుటేరు ఎఫెక్ట్..

కొల్లేరు, ఉప్పుటేరు పొంగితే డ్రైన్ల నీరు స్తంభించిపోతుంది. 32 కిలోమీటర్లు ప్రవహించిన కోమటిలంక వద్ద కొల్లేరులో పోల్‌రాజ్ డ్రైన్ కలుస్తుంది. కొల్లేరు పొంగితే ఈ డ్రైన్‌లో నీరు కదలదు. ఉప్పుటేరు పొంగితే పెదకొమ్మిలేరు, చినకొమ్మిలేరు డ్రైన్లు స్తంభించిపోతాయి. ఉప్పుటేరును విస్తరిస్తేనే ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారమని గతంలో మిత్రా కమిటీ చేసిన సూచనలు బుట్ట దాఖలయ్యాయి. ముంపు సమస్య వల్లే కైకలూరు నియోజకవర్గంలోని 70 శాతం భూముల్లో రైతులు వరి సాగును వదిలేసి చేపల చెరువులను తవ్వేశారు.

నిర్వహణ నిధుల్లేవ్..

ఏళ్ల తరబడి డ్రైన్ల నిర్వహణకు నిధులు లేవు. ఓఅండ్ఎం నిధులను ప్రభుత్వం మంజూరు చేయటం లేదు. తుఫాన్ల సమయంలో పొలాలు ముంపునకు గురయ్యాక డ్రైన్లలో డెక్క, ఇసుక మేటలను తొలగించేందుకు నిధులు లేక బడా కాంట్రాక్టర్లను ప్రజాప్రతినిధులు, అధికారులు బ్రతిమాలి వారితో తాత్కాలికంగా ఆ పనులు చేయిస్తున్నారు.



ప్రత్యేక నిధులివ్వాలి : బొప్పన సుందర రామయ్య, రైతు, ములకలపల్లి

డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణకు నిధులు మంజూరు చేయకపోవటం దారుణం. మేజర్, మీడియం డ్రైన్లు పూడుకుపోతున్నాయి. అయినా ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. ప్రతి ఏటా జూన్‌లో డ్రైన్లలో ఇసుక మేటలు, గుర్రపు డెక్క పనులు నిర్వహిస్తే ముంపు సమస్య తగ్గుతుంది. ఇందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి.



పెదలంక డ్రైన్ యూటీ అభివృద్ధి అవసరం : రెడ్డి నాగరాజు, స్తంభం చెరువు

పెదలంక మేజర్ డ్రైన్ కింద ముంపు నివారణకు గర్సిపూడి అండర్ టన్నెల్ (యూటీ) అభివృద్ధి ఎంతో అవసరం. అయిదేళ్లుగా ప్రభుత్వం దానిని పట్టించుకోలేదు. దానికి ప్రత్యామ్నాయంగా నిడమర్రు వద్ద పెద్ద రెగ్యులేటర్ రూ.40 కోట్ల వ్యయంతో నిర్మిస్తామని నాయకులు చెప్పారే కానీ నేటికీ పనులు ప్రారంభం కాలేదు.

కొల్లేరుకు శాశ్వత పరిష్కారం..



కామినేని, పుట్టా మహేష్‌లను సత్కరిస్తున్న కొల్లేరు సంఘ నాయకులు

- కొల్లేరు గ్రామాలకు జలజీవన్‌మిషన్‌తో తాగునీరు
- ఆక్వా పరిశ్రమ అభివృద్ధికి కృషి
- ఆత్మీయ సమావేశంలో కామినేని, పుట్టా మహేష్ హామీ

కైకలూరు, మార్చి 30: కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని కైకలూరు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఏలూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ అన్నారు. శనివారం కైకలూరులో టీడీపీ రాష్ట్ర వడ్డి సాధికార సమితి కన్వీనర్ బలే ఏసురాజు ఆధ్వర్యంలో కొల్లేరుకు శాశ్వత పరిష్కారం అంశంపై కొల్లేరు ప్రజల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో కొల్లేరు కాంటూరును 5 నుంచి 3కు కుదించి 31 వేల ఎకరాలను ప్రజలకు అందిస్తానన్నారు. తాత్కాలికంగా చెరువులు తవ్వుకున్న ప్రతి ఒక్కరికి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కొల్లేరు సమస్య తీరాలన్నా ప్రజల జీవనోపాధి పెరగాలన్నా రాష్ట్రంలో తెలుగుదేశం, కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండాలని ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి మీ సమస్యలను పరిష్కరించే నాయకులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అలాగే కాంటూరు పరిధిలో డ్రైన్ల మరమ్మతులు కూడా పూర్తిచేస్తానని, 2019కు ముందే కొల్లేరు సమస్యపై కేంద్రం దృష్టికి తీసుకువెళ్లామని మరలా అధికారంలోకి రాగానే దాన్ని పూర్తిచేసే బాధ్యత అసెంబ్లీ, పార్లమెంటు అభ్యర్థులమైన తమను గెలిపిస్తే తమ భుజస్కంధాలపై వేసుకుని సమస్యను పరిష్కరిస్తామన్నారు. సుకుమార్ కమిటీ నివేదిక ఆధారంగా కొల్లేరు కాంటూరును కుదించేందుకు సాధ్యపడుతుందని ఈ ప్రధాన అంశాన్ని తాము చెప్పటమే గాక ఎన్నికల పర్యటనలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సైతం హామీ ఇస్తారన్నారు. ఆక్వా పరిశ్రమ అభివృద్ధి చేసి, విద్యుత్ యూనిట్ రూ.1.50కే అందిస్తామని, జలజీవన్ మిషన్ ద్వారా కొల్లేరులో అన్ని గ్రామాలకు తాగునీటిని అందిస్తానన్నారు. కొల్లేరు ప్రజల పట్ల స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు కపట ప్రేమ చూపుతున్నారని ఆయన కుటుంబ పాలనకు భయపడాల్సిన పని లేదని ప్రజలందరికీ తాను అండగా ఉంటానన్నారు. ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ కొల్లేరు సమస్య పార్లమెంట్ దృష్టికి తీసుకు వెళతానని, గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తానన్నారు. ముందుగా ఏసురాజు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా కొల్లేరు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని గ్రామాల్లో కట్టే ప్రభుత్వ భవనాలకు కొల్లేటికోట అనివేటి మండపం నిర్మాణానికి గ్రామాల నుంచి రూ.30 లక్షలు వసూలు చేశారని ప్రభుత్వ భవన నిర్మాణాలకు ప్రభుత్వ నిధులు సమకూర్చకుండా గ్రామాల నుంచి వసూలు చేయడంతో ప్రజలు అప్పులపాలయ్యారని చెరువులు తవ్విస్తానని నమ్మబలికి ఒక్కో ఎకరానికి రూ.50 వేలు వసూలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లేరు ప్రజల పట్ల వివక్షత చూపుతూ ఐదు సంవత్సరాలు నరకయాతన అనుభవించామని రానున్న ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేస్తామన్నారు. ఈ సందర్భంగా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కామినేనిని, ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌ను ఘనంగా సత్కరించారు. ఇంగిలిపాకలంక సర్పంచ్ ఘంటసాల సంపత్‌రాజు, నబిగారి రాంబాబుతో పాటు వందలాదిమంది ఎన్డీయే కూటమిలోకి చేరారు. కొల్లేరు సంఘ నాయకులు సైదు సత్యనారాయణ, కొల్లేరు గ్రామాల సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.


చీపురుగూడెంలో చింతలపూడి కాలువ పరిశీలిస్తున్న మహేష్ యాదవ్

చింతలపూడి పూర్తి చేయటమే లక్ష్యం

- ఏలూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి మహేష్ యాదవ్

చాట్రాయి, మార్చి 30: తాను గెలుపొందిన వెంటనే చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు పునఃప్రారంభించి మెట్ట ప్రాంతాన్ని గోదావరి జలాలతో సస్యశ్యామలం చేస్తానని ఏలూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ అన్నారు. శనివారం చీపురుగూడెంలో చింతలపూడి ఎత్తిపోతల పథకం అసంపూర్తి పనులను టీడీపీ నాయకులతో కలసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ విధ్వంస పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిందని మళ్ళీ నవ్యాంధ్రకు పూర్వ వైభవం రావాలంటే మంచి విజన్ ఉన్న చంద్రబాబు సీఎం కావాలన్నారు. కూటమి అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాల అమలుతో పాటు, పోలవరం, చింతలపూడి మొదలైన సాగునీటి ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు. నియోజకవర్గ టీడీపీ నాయకుడు అట్లూరి రమేష్, విజయ డెయిరీ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, మండల నాయకులు మరిడి చిట్టిబాబు, మంచిన పూర్ణ, మందలపు జగదీష్, తమ్మిశెట్టి లక్ష్మణరావు, వెల్ది నాగేశ్వరరావు, పాపోతు రాంబాబు, జయరామ్ పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని చీపురుగూడెంలో ఇటీవల మృతి చెందిన టీడీపీ నాయకుడు చీకటి చెన్నారావు కుటుంబీకులను మహేష్ యాదవ్, ఏలూరు పార్లమెంట్ బీజేపీ నాయకుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి దంపతులు పరామర్శించి, చెన్నారావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.



మహిళల సంక్షేమమే కూటమి లక్ష్యం

కలిదిండి, మార్చి 30 : మహిళల సంక్షేమమే కూటమి లక్ష్యమని జడ్పీటీసీ మాజీ సభ్యురాలు నున్న రమాదేవి అన్నారు. శనివారం కలిదిండిలో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు నున్న సుబ్రహ్మణ్యం, నాయకులు బోయిన గోవింద్, భట్రాజు ఏసుబాబు, కట్టా మారయ్య, బత్తిన ఆంజనేయులు, యలవర్తి వెంకటేశ్వరరావు, దొంతుబోయిన విజయ్, కట్టా కొండ తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు..

ముదినేపల్లి, మార్చి 30 : ఎండలు మండుతున్నాయి. ఉదయం 9 గంటలకే ఉక్కపోతలు ప్రారంభమవుతున్నాయి. ముదినేపల్లి ప్రాంతంలో శనివారం ఎండతోపాటు ఒక మాదిరి వడగాల్పులు వీచాయి. ఉదయం 11 గంటల నుంచి రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ఎండలో పలువురు గొడుగు వేసుకుని బజారుకు రావటం కనిపించింది. జన సంచారం తగ్గింది.


మాట్లాడుతున్న నూజివీడు కూటమి అభ్యర్థి పార్థసారథి

కార్పొరేషన్ నిధులూ స్వాహా చేశారు

ముసునూరు, మార్చి 30: కార్పొరేషన్ నిధులను సైతం వైసీపీ కైంకర్యం చేసిందని నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. శనివారం కాట్రేనిపాడులో పార్టీ గ్రామ అధ్యక్షుడు మొక్కపాటి రామారావు అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమావేశంలో పార్థసారథి మాట్లాడుతూ కేంద్రం ఇస్తున్న వివిధ కార్పొరేషన్ నిధులను ఈ ప్రభుత్వం దారిమళ్లించి, ఐదేళ్ళ పాలనలో ఒక్క రుణం కూడా మంజూరు చేయలేదన్నారు. ప్రతి కులానికి ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, ఛైర్మన్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చిందన్నారు. రుణాలు ఇవ్వకపోడం వల్ల అనేక మంది ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేతివృత్తుల వారికి ఆదరణ పథకం ద్వారా ఉచితంగా పరికరాలు, కార్పొరేషన్ రుణాలు అందించి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. రైతాంగానికి సాగునీరు అందేలా చింతలపూడి ఫేజ్-2ను పూర్తిచేస్తామన్నారు. నూజివీడులో టీడీపీ జెండా ఎగురవేసేలా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషిచేయాలని ఆయన కోరారు. సర్పంచ్ గద్దల సుహాసిని మోహన్‌రావు, రాపర్ల బాలకృష్ణ, ప్రతాప్, గూడపాటి అజయ్‌కుమార్, బోయపాటి భాను, సాంబయ్య, అంబేడ్కర్ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి శనివారం రజక, యాదవ సామాజిక వర్గాలను కలసి సమస్యలడిగి తెలుసుకున్నారు. మహిళలు సమస్యలు చెప్పడంతో ఇన్ని సమస్యలు ఉన్నాయా అని ఆయన ఆశ్చర్యపోయారు. తనను ఆశీర్వదించి గెలిపిస్తే తమ ప్రభుత్వం రాగానే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఒక్క రోజులో 250 వాహనాల తనిఖీ



ముదినేపల్లి, మార్చి 30 : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ముదినేపల్లి మండలంలో వాహనాల తనిఖీలు పెద్ద సంఖ్యలో జరుగుతున్నాయి. ఎస్ఎస్‌టి టీం, ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఎన్నికల కోడ్ అమలు కమిటీ అధికారులు వాహన తనిఖీలను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. శనివారం నంబర్ 165 పామర్రు - దిగమర్రు జాతీయ రహదారిలో ముదినేపల్లి మండల పరిధిలో ఎస్ఎస్‌టి చెక్ పోస్టు వద్ద టీం అధికారి, మండల పరిషత్ ఏవో రమణబాబు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి, డ్రైనేజీ ఏఈ కుమార్ ఆధ్వర్యంలో సుమారు 250 వాహనాలను తనిఖీ చేశారు. కృష్ణా జిల్లా నుంచి ఏలూరు జిల్లాలోకి ప్రవేశించే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. కార్లు, ఇతర వాహనాలు, ఆర్టీసీ బస్సులను ఆసాంతం తనిఖీ చేస్తున్నారు. ముదినేపల్లి ఎస్ఐ వెంకట్ కుమార్, ఏఎస్ఐ దత్తుతోపాటు సచివాలయాల మహిళా పోలీసులు కూడా తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ చెక్ పోస్టు వద్దే కాక ముదినేపల్లి - బంటుమిల్లి, గుడ్లవల్లేరు, కైకలూరు ప్రధాన రహదారుల్లో కూడా వాహనాల తనిఖీలను పెద్ద సంఖ్యలో నిర్వహించారు.



ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రాజెక్టుకు ఆమోదం

నూజివీడు టౌన్, మార్చి 30: సీతాకోక చిలుకల్లో సమాచారాన్ని చేరవేసుకునే విధానంలోని సాంకేతికతను పరిగణలోకి తీసుకుని నూజివీడు ట్రిపుల్ ఐటీకి చెందిన విద్యార్థులు రూపొందించిన ఏరియల్ రోబోటిక్ ప్లాట్‌ఫాం ప్రాజెక్టును ఐఐటీ హైదరాబాద్ ఇన్నోవేషన్ హబ్ ఆమోదించినట్టు నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. సీతాకోక చిలుకల్లో తాము కలుసుకునేందుకు, ప్రమాద సమయాల్లో దూరంగా వెళ్ళేందుకు ప్రత్యేకంగా సమాచార మార్పిడి చేసుకుంటాయని, అదే సాంకేతికతను డ్రోన్ సిస్టమ్‌కు అన్వయించటం ద్వారా మానవ జోక్యం సాధ్యంకాని వివిధ పరిశ్రమల్లో ప్రమాద సంఘటనల్లో డ్రోన్ టెక్నాలజీతో ఇబ్బందులను అధిగమించే దిశగా నూజివీడు ట్రిపుల్ ఐటీ, ట్రిపుల్ ఈ విద్యార్థులు జశ్వంత్, పావని ప్రాజెక్టులు రూపొందించారన్నారు. ఈ ప్రాజెక్టు ఐఐటీ హైదరాబాద్ ఇన్నోవేషన్ హబ్ ఆమోదించటం ప్రతిష్ఠాత్మకమన్నారు. ప్రాజెక్టును సమర్పించిన విద్యార్థులను ఆర్జీయూకేటీ వైస్ ఛాన్సలర్ ఎం.విజయ్‌కుమార్, ఏవో టి.చంద్రశేఖర్, డీన్ ఆఫ్ అకాడమిక్స్ ఎన్.రత్నాకర్ తదితరులు అభినందించారు.

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ పోటీలు



నూజివీడు, మార్చి 30: బొబ్బిలి కొండలరావు మెమోరియల్ ఇన్విటేషనల్ జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శనివారం మొత్తం మూడు మ్యాచ్‌లు నిర్వహించగా, తొలుత కేరళ ఎలక్ట్రిసిటీ బోర్డు, జైన్ వర్సిటీ బెంగుళూరు మధ్య పోటీ నిర్వహించగా, 82-56 స్కోరుతో జైన్ వర్సిటీపై కేరళ ఎలక్ట్రిసిటీ బోర్డు విజయం సాధించింది. రెండో మ్యాచ్ ఇండియన్ నేవీ, ఏపీ జట్ల మధ్య నిర్వహించగా, 102-69 స్కోరుతో ఇండియన్ నేవీ విజయం సాధించింది. మూడో మ్యాచ్ జైన్ వర్సిటీ బెంగుళూరు, ఏపీ జట్ల మధ్య సాగగా 75-58 స్కోరుతో ఏపీపై జైన్ వర్సిటీ విజయకేతనం ఎగురవేసింది.



బాస్కెట్‌బాల్ టీమ్‌కు సత్కారం

నూజివీడు టౌన్, మార్చి 30: భారత నౌకాదళం బాస్కెట్ బాల్ టీంను నూజివీడు త్రివిధ విద్యార్థులు సత్కరించారు. నూజివీడు డీఏఆర్ కళాశాలలో మూడు రోజులుగా జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన భారత నౌకా దళం బాస్కెట్‌బాల్ జట్టు త్రివిధ విద్యార్థులకు నౌకాదళం ప్రాముఖ్యత, నౌకా దళంలో సిబ్బంది పాత్రపై తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్, టీం కోచ్ వెంకటేష్, ఇండియన్ టీమ్‌కు ప్రాతినిధ్యం వహించిన మహిపాల్, లలిత్, ఇతర సభ్యులను సత్కరించారు.

కోటపాడులో వైభవంగా రామాలయ ప్రతిష్ఠ



చాట్రాయి, మార్చి 30: కోటపాడులో నూతనంగా నిర్మించిన కోదండరామాలయంలో శనివారం విగ్రహ, శిఖర, ధ్వజ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా నిర్వహించారు. సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ప్రతిష్ఠా మహోత్సవానికి భక్తులు భారీగా తరలివచ్చారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్, రాష్ట్ర సహకార యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఏలూరు పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి కారుమూరి సునీల్ యాదవ్ స్వామివారికి పూజలు చేశారు. అనంతరం భారీ అన్న సమారాధన జరిగింది.

ఎంపీ కూటమి అభ్యర్థి మహేష్ పరామర్శలు

ముసునూరు, మార్చి 30: కాట్రేనిపాడు బీసీ కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు పిన్నిబోయిన వీరయ్య కుటుంబాన్ని ఏలూరు ఎంపీ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ శనివారం పరామర్శించారు. ఇటీవల వీరయ్య కూమార్తె భవాని పాముకాటుకు గురై మృతి చెందింది. ఎల్లవేళల అండగా ఉంటామని మహేష్ యాదవ్ వారికి భరోసా ఇచ్చారు. అలాగే పదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఎస్సీ కాలనీకి చెందిన సొంగా అశోక్ అనే యువకుడిని పరామర్శించి హైదరాబాద్‌లో పూర్తిస్థాయిలో చికిత్స చేయిస్తానని హామీ ఇచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు దేవినేని దలరాం, గ్రామ అధ్యక్షులు మొక్కపాటి వెంకట రామారావు, నాయకులు రాపర్ల బాలకృష్ణ, గద్దల మోహన్‌రావు, రాపర్ల ప్రతాప్, పొట్లూరి వెంకట్రావ్, అంగడాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.